

మహా కుంభమేళా ప్రత్యేక రైలు పొడిగింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-గోరఖ్‌పూర్ మధ్య ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్లను కుంభమేళా ప్రయాణికుల డిమాండ్ మేరకు మరికొద్ది ట్రిప్పులు కొనసాగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08588 నంబర్ గల ప్రత్యేక రైలు ఈ నెల 10, 22 తేదీల్లో రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయలుదేరి 13, 25 తేదీల్లో రాత్రి 7.30 గంటలకు గోరఖ్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08587 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 13, 25 తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి 15, 27 తేదీల్లో మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖ చేరుతుంది.

హయగ్రీవకు ఈడీ షాక్

భాగస్వాముల ఆస్తులు అటాచ్‌మెంట్

- వృద్ధాశ్రమం పేరుతో పద్దెనిమిదేళ్ల కిందట ప్రభుత్వం నుంచి 12.51 ఎకరాలు తీసుకున్న రియల్ ఎస్టేట్ కంపెనీ
- అప్పట్లో రూ.5.63 కోట్లు చెల్లింపు
- గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు ఎంటర్
- నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు, నిర్మాణాలు
- న్యాయస్థానంలో టీడీపీ, జనసేన నేతల కేసు
- రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత మాజీ ఎంపీ ఎంవీవీ సహా ముగ్గురిపై పోలీసులకు 'హయగ్రీవ' యజమాని జగదీశ్వరుడు ఫిర్యాదు
- రంగంలోకి దిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- అంతా కలిసి మేసింది రూ.87.64 కోట్లు

హయగ్రీవ ప్రాజెక్టులో నిర్మాణాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వృద్ధుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆడిన నాటకం బట్టబయలైంది. ప్రభుత్వం నుంచి నామమాత్రపు ధరకు భూమి తీసుకొని దానిపై 15 రెట్ల వ్యాపారం చేసినట్టు తేలింది. దాంతో వారికి చెందిన రూ.44.75 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్వాధీనం చేసుకుంది. భూమిని రూ.5.63 కోట్లకు కొని దాని ద్వారా రూ.97.64 కోట్ల వ్యాపారం చేశారని ఇప్పటివరకూ వెలుగుచూసిన లెక్కలు చెబుతున్నాయి.

వృద్ధాశ్రమం కథ 2006లో మొదలు

వృద్ధులకు ఆశ్రమాలు నిర్మించి, ఉచితంగా నిర్వహిస్తామంటూ హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ యజమాని చిలుకూరి జగదీశ్వరుడు 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయాన భూమి కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. ఎండాడలోని సర్వే నంబరు 92/3లో 12.51 ఎకరాల భూమిని కేటాయించగా, అందుకుగాను రూ.5.63 కోట్లు చెల్లించారు. కొంతకాలం తరువాత అందులో నిర్మాణం చేపట్టడానికి దరఖాస్తు చేయగా కలెక్టర్ నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌ఓసీ) తీసుకురావాలని జీవీఎంసీ అధికారులు సూచించారు. అడ్డంకులు కల్పిస్తున్నారంటూ ఆయన కోర్టును ఆశ్రయించడంతో నిబంధనల ప్రకారం ప్రాజెక్టు ప్రారంభించిన నాటి నుంచి మూడేళ్లలో పూర్తి చేయాలంటూ షరతులతో కూడిన అనుమతులు 2018లో ఇచ్చారు. ఆ తరువాత ఆ భూమిలో నుంచి 60 అడుగుల వెడల్పున వుడా మాస్టర్ ప్లాన్ రహదారి ఉన్నందున రివైజ్డ్ ప్లాన్ సమర్పించాలని అధికారులు సూచించారు.

హయగ్రీవ ప్రాజెక్టు వ్యవహారంలో అవకతవకలు జరుగుతున్నాయని టీడీపీ నాయకుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్‌లు 2021లో కోర్టులో కేసు వేశారు. వాటిపై వివరాలు సమర్పించాలని కోర్టు ఆదేశించడంతో జిల్లా కలెక్టర్ ఆ బాధ్యతను జీవీఎంసీ అధికారులకు అప్పగించారు. దాంతో వారు క్షేత్ర స్థాయికి వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. సంబంధిత పత్రాలన్నీ సమర్పించాలని, వాటిని పరిశీలించాకే తాము అనుమతి స్తామని తేల్చిచెప్పారు. దాంతో

... మిగతా 6వ పేజీలో

ప్రాక్టికల్ పరీక్షలకు పైసా వసూల్!

- ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు...
- ప్రైవేటు కళాశాలల నిర్వాకం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను జిల్లాలోని కొన్ని ప్రైవేటు కళాశాలలు సొమ్ము చేసుకునేందుకు రంగం సిద్ధం చేశాయి. పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేయిస్తామని విద్యార్థుల నుంచి డబ్బులు పిండుతున్నాయి. కొన్ని కళాశాలలు ల్యాబ్ ఫీజుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు చొప్పున వసూలు చేస్తుండగా, మరికొన్ని రూ.5 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం.

అక్రమాలు చోటుచేసుకోకూడదనే గతంలో ప్రాక్టికల్ పరీక్షలను జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించేవారు. గత మూడేళ్లుగా ఈ విధానం రద్దు చేసి, విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎంసెట్ ర్యాంకు కేటాయింపులో ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉండడంతో విద్యార్థులకు ప్రతి మార్కు కీలకంగా మారింది. దీనిని ఆసరాగా తీసుకుని కళాశాలల యాజమాన్యాలు ఫుల్ మార్కులు వేసేలా ఎగ్జామినర్లతో ముందస్తుగా మాట్లాడుకుంటున్నాయి. విద్యార్థుల నుంచి డబ్బులు వసూలుచేసి, వారికి చెల్లిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

జిల్లాలో ఈనెల పదో తేదీ నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 146 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు ఎంపీసీ నుంచి 29,791, బైపీసీ నుంచి 4,888 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రభుత్వ కళాశాలలకు చెందిన 937 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పరీక్షలకు జంబ్లింగ్ పద్ధతిలో ఎగ్జామినర్లను నియమిస్తారు. వారిని ప్రసన్నం చేసుకోవడానికి ఇప్పటికే ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల నుంచి డబ్బు వసూలుచేసినట్టు సమాచారం. ప్రభుత్వ కళాశాలలు మినహా ప్రైవేటు కళాశాలల్లోని 33 వేల మందికి పైగా విద్యార్థుల నుంచి సుమారు రూ.5 కోట్ల వరకు

... మిగతా 6వ పేజీలో

అవినీతి ఖజానా

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి మళ్లీ పోస్టింగ్!

- కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకున్నారనే అభియోగంపై రెండేళ్ల క్రితం పాడేరు సబ్ ట్రెజరీ అధికారి, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు సస్పెన్షన్
- ఆ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేయాల్సిందిగా నాటి కలెక్టర్ ఆదేశం
- ఆయన బదిలీ కావడంతో మారిపోయిన సీన్
- అక్రమాలే జరగలేదంటూ విచారణ ముగించిన ఖజానా అండ్ అకౌంట్స్ విభాగం ఉన్నతాధికారులు
- ముగ్గురికీ విశాఖలో పోస్టింగ్
- పెద్దమొత్తంలో ముడుపులు అందినట్టు ప్రచారం


ఖజానా ఉద్యోగులపై వేటు

ట్రెజరీ అధికారుల సస్పెన్షన్‌పై 2023 మార్చి 14న 'ఆంధ్రజ్యోతి' క్లిప్పింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సుమారు రూ.7 లక్షలు లంచం తీసుకున్నారనే అభియోగంపై సస్పెన్షన్‌కు గురైన ట్రెజరీ అధికారులకు క్లీన్ చిట్ ఇస్తూ విశాఖపట్నంలో పోస్టింగ్ ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో భారీ మొత్తం చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాలకు 2022లో విద్యుత్ అలంకరణ పనులు చేసిన కాంట్రాక్టర్ రూ.34.3 లక్షల బిల్లులను గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా ప్రభుత్వానికి సమర్పించారు. ఆ బిల్లు (గుర్తింపు నంబర్: 1338602) అమరావతిలో సీఎఫ్ఎంఎస్‌లో 2022 సెప్టెంబరులో పాసైంది. దీంతో రూ.34.3 లక్షలను పాడేరు సబ్ ట్రెజరీలో అదే ఏడాది డిసెంబరులో సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించారు.

రూ.7 లక్షలు లంచం తీసుకున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

బిల్లు రూ.34.3 లక్షలు చెల్లించేందుకు స్థానిక సబ్‌ట్రెజరీ అధికారులు రూ.7 లక్షలు లంచం తీసుకున్నారని సదరు కాంట్రాక్టర్ 2023 మార్చి నెలలో అప్పటి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రూ.4 లక్షలు సీఎఫ్ఎంఎస్ అధికారులకు, రూ.3 లక్షలు స్థానిక సబ్ ట్రెజరీలో అధికారులు తీసుకున్నారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పాడేరు సబ్‌ట్రెజరీ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ తన వద్దకు పిలిపించుకుని ఈ వ్యవహారంపై నిలదీశారు. కాంట్రాక్టర్ వద్ద లంచంగా తీసుకున్న రూ.7 లక్షలు తక్షణమే వెనక్కి చెల్లించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తానని హెచ్చరించారు. అయితే తాము రూ.7 లక్షలు తీసుకోలేదని, సీఎంఎఫ్ఎస్ విభాగానికి రూ.4 లక్షలు, సబ్‌ట్రెజరీ మామూళ్లుగా రూ.లక్ష చొప్పున మొత్తం రూ.5 లక్షలు మాత్రమే తీసుకున్నామని కలెక్టర్ వద్ద అంగీకరించారు. ఆ రూ.5 లక్షలు బాధితుడికి తిరిగి చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. అందుకు సబ్‌ట్రెజరీ అధికారులు అంగీకరించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో 2023 మార్చి 13న ఒక సబ్ ట్రెజరీ అధికారి, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేశారు.

కలెక్టర్ మారడంతో సీన్ మారింది..

ఖజానా అధికారులపై ఫిర్యాదు చేసిన అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరుకు బదిలీ కావడంతో మొత్తం సీన్ మారిపోయింది. సస్పెన్షన్‌కు గురైన ఎస్‌టీవో, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఖజానా అండ్ అకౌంట్స్ శాఖలో భారీస్థాయిలో పైరవీలు సాగించారు. ఈ నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు అధికారులు ఎటువంటి తప్పు చేయలేదని విచారణలో ధ్రువీకరించడంతోపాటు వారికి నాలుగు నెలల క్రితం విశాఖపట్నంలో పోస్టింగ్ ఇచ్చారు. ఒక జిల్లా కలెక్టర్ స్వయంగా ఫిర్యాదు చేసిన వ్యవహారంలో సస్పెండైన అధికారులు ఎటువంటి తప్పు లేదని నిర్ధారించడం, విశాఖపట్నంలో పోస్టింగ్ ఇవ్వడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

రూ.40 కోట్లతో పంచాయతీల అభివృద్ధి

- ప్రణాళికలు రూపొందించిన అధికారులు
- కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా నిధుల వ్యయం

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నిధులు ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలన్న కేంద్రం ఆదేశాలను తూచా తప్పకుండా అమలుచేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అభివృద్ధి, ప్రధానంగా ప్రజల అవసరాల మేరకు పనులు చేపట్టాలన్నదే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలోని 79 గ్రామ పంచాయతీలకు కలిపి సుమారు రూ.40 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. పంచాయతీలకు వచ్చే ఆదాయం, కేంద్ర, రాష్ట్రాలు ఇచ్చే నిధులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికలు ఖరారు చేశారు. అయితే పంచాయతీలకు వచ్చే ఆదాయం కంటే 25 శాతం అదనపు మొత్తంతో ప్రణాళికలు రూపొందించుకునే వెసులుబాటు కల్పించారు. జిల్లాలో గంభీరం, వెల్లంకి, వేములవలస, బీపీ కళ్లాలు, ఎల్‌బీ పాలెం, పెద్దిపాలెం, పద్మనాభం తదితర పంచాయతీలకు రూ.కోటి నుంచి రూ.రెండు కోట్ల వరకూ ఆదాయం వస్తోంది. వెల్లంకి గ్రామ పంచాయతీకి సుమారు రూ.1.9 కోట్లు, గండిగుండం పంచాయతీకి రూ.2.93 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. పంచాయతీలకు సాధారణ నిధులు, తలసరి గ్రాంటు, రిజిస్ట్రేషన్ ఆదాయం, కేంద్రం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తుంటాయి. జీవీఎంసీకి ఆనుకుని ఉన్న గ్రామ పంచాయతీలు, జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న పంచాయతీలకు ఎక్కువ ఆదాయం వస్తుంటుంది. శివారులో ఉన్న పంచాయతీలకు అన్నిరకాల ఆదాయం కలిపి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 79 పంచాయతీల అభివృద్ధికి కలిపి సుమారు రూ.40 కోట్లతో

... మిగతా 6వ పేజీలో

కోడి వ్యర్థాల సేకరణ టెండర్లలో గోల్‌మాల్

- ప్రజా ప్రతినిధులు, నేతలు సూచించిన వారికే కాంట్రాక్టులు
- ఒక్కో నేత సూచించిన వ్యక్తికి ఒక్కో జోన్ కేటాయింపు
- కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చేరని వ్యర్థాలు
- యథావిధిగా చేపల చెరువులకు తరలింపు
- పారదర్శకంగా నిర్వహించాలని జీవీఎంసీ అధికారులు భావించినా ముందుకుసాగనివ్వని నాయకులు

జీవీఎంసీ పరిధిలో అధికారికంగా ఉన్న	
చికెన్ దుకాణాలు	1,500
అనధికారికంగా ఉన్న దుకాణాలు(అంచనా)	1,000
రోజుకి ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు	మూడు టన్నులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ల ఖరారులో కొంత మంది ప్రజా ప్రతినిధులు చక్రం తిప్పారు. తాము సూచించిన వారికే కేటాయించాలంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చి...అనుకున్నది సాధించారు. పేరుకు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పిలిచినప్పటికీ...రాజకీయ నాయకులు సిఫారసు చేసిన వారికే కేటాయించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జీవీఎంసీ పరిధిలో అధికారికంగా దాదాపు 1,500 చికెన్ దుకాణాలు ఉండగా, అనధికారికంగా మరో వెయ్యి వరకూ ఉన్నాయి. వాటి నుంచి ప్రతిరోజూ మూడు టన్నుల వరకు చికెన్‌వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. ఈ వ్యర్థాలను కాపులుప్పాడలోని యార్డుకు తరలించే బాధ్యతను జీవీఎంసీ కాంట్రాక్టర్లకు అప్పగించేది. అయితే చేపల చెరువుల్లో వినియోగించడం మొదలెట్టడంతో చికెన్ వ్యర్థాలకు డిమాండ్ పెరిగింది. వైసీపీ హయాంలో చికెన్ వ్యర్థాల సేకరణకు జీవీఎంసీ అధికారులు టెండర్లు పిలవగా, కొందరు కాంట్రాక్టర్లు వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధులకు ముడుపులు చెల్లించి మరీ టెండర్లు దక్కించుకున్నారు. వైసీపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కొక్కరి పేరు సిఫారసు చేయడంతో ఒక్కొక్కరికి రెండేసి జోన్‌లు చొప్పున నలుగురికి సర్దుబాటు చేశారు. రెండేళ్లు గడిచిపోవడంతో ఐదు నెలల కిందట జీవీఎంసీ అధికారులు తిరిగి టెండర్లు పిలిచారు. ఆరోపణలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా కేటాయింపు జరపాలనే ఉద్దేశంతో అప్పటి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించారు. ఆమోదయోగ్యమైన రేటుకు చికెన్ వ్యర్థాలను కాపులుప్పాడ తరలించేందుకు ముందుకొచ్చేవారికే టెండర్లు ఖరారు చేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు. అయితే, చికెన్ వ్యర్థాల ద్వారా డబ్బు సంపాదనకు అలవాటుపడిన కొంతమంది కాంట్రాక్టర్లు తమకు టెండర్ వచ్చేలా చూడాలని కూటమి ప్రజా ప్రతినిధులను కలిశారు. దాంతో తాము సూచించిన వారికే వ్యర్థాల టెండర్లు ఇవ్వాలని జీవీఎంసీ అధికారులకు ఆయా ప్రజా ప్రతినిధులు ఫోన్లు చేశారు. ప్రజా ప్రతినిధుల మాట కాదనలేని అధికారులు...చాలామంది వద్ద నుంచి సిఫార్సులు వచ్చాయని, ఎలా ముందుకెళ్లాలని వారినే తిరిగి ప్రశ్నించారు. వారి

... మిగతా 6వ పేజీలో

వివేకానందుడే స్ఫూర్తి



యువతకు వివేకానందుడే స్ఫూర్తి అని వక్తలు కొనియాడారు. వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నగరంలోని రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులు వివేకానందుడి సూక్తులతో కూడిన ప్లకార్డులు పట్టుకుని శోభాయాత్ర నిర్వహించారు.

- 8లో

ఎన్‌టీఆర్ వైద్య సేవ బకాయిలు విడుదల

- 'ఆరోగ్యశ్రీ'కి సంబంధించి రూ.2,400 కోట్ల మేర పెండింగ్ పెట్టిన వైసీపీ ప్రభుత్వం
- సేవల నిలిపివేతకు సిద్ధమైన నెట్‌వర్క్ ఆస్పత్రులు
- బిల్లులు క్లియర్ చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ
- రెండు దశల్లో రూ.1400 కోట్లు విడుదల
- జిల్లాలో 85 ఆస్పత్రులకు రూ.80 కోట్ల వరకూ రాక



విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'ఎన్‌టీఆర్ వైద్య సేవ' పథకం కింద సేవలు అందిస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రులకు కూటమి ప్రభుత్వం దశల వారీగా బకాయిలు చెల్లిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు వైసీపీ ప్రభుత్వం రూ.2,400 కోట్ల మేర బకాయి పెట్టింది. అందులో జిల్లాలోని ఆస్పత్రులకు సుమారు రూ.120 కోట్ల మేర రావాల్సి ఉంది. భారీగా బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో వైద్య సేవలు నిలిపివేసేందుకు కూడా ఒక దశలో ఆస్పత్రుల యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. అయితే, కూటమి ప్రభుత్వం సంప్రతింపులు జరిపి బిల్లులు చెల్లింపునకు హామీ ఇచ్చింది. ఆ మేరకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బకాయిలు, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అందించిన వైద్య సేవలకు సంబంధించి సుమారు రూ.1400 కోట్లు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఇందులో జిల్లాలోని 85 ఆస్పత్రులకు సుమారు రూ.80 కోట్ల మేర వచ్చినట్టు తెలుస్తోంది. మిగిలిన మొత్తాన్ని కూడా కొద్దిరోజుల్లో చెల్లించేందుకు ఆస్పత్రుల యాజమాన్యాలకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 1,11,787 శస్త్ర చికిత్సలు

ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం కింద రోగులకు సేవలు అందించే ఆస్పత్రులు విశాఖపట్నం జిల్లాలో 85 వరకూ ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఆస్పత్రులు 22 కాగా, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు 63. వీటిలో వైద్య సేవలు పొందేందుకు విశాఖతోపాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పక్కనున్న విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. గడిచిన ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు జిల్లాలో 1,11,787 శస్త్ర చికిత్సలు చేయడం జరిగింది.

మార్పులు తెచ్చే యోచన

ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో కొన్ని మార్పులు తెచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఇన్సూరెన్స్ విధానం అమలుచేస్తే ఎలా ఉంటుందన్న దానిపై ప్రస్తుతం చర్చిస్తోంది. ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది. పాలసీ దారులు ఎవరైనా ఆస్పత్రుల్లో చేరితే నేరుగా ఇన్సూరెన్స్ కంపెనీలే ఆస్పత్రులకు బిల్లులు చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విషయంలో రాజీ లేకుండా, ఆస్పత్రులు ఇబ్బంది పడకుండా చూడాలనే యోచనలో ప్రభుత్వం ఉందని చెబుతున్నారు.



తలంబ్రాల బియ్యం చూపుతున్న అర్చకులు

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి అర్జిత నిత్య కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు సమర్పించాక పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణాన్ని జరిపారు. అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

విద్యార్థుల విష్ణుసహస్రనామ పారాయణ

భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మానవాళికి భీష్మ పితామహుడు అందించిన విష్ణు సహస్రనామ పారాయణాన్ని సింహాచల దేవస్థానం ఆధీనంలోని సంస్కృత ఉన్నత (ఎస్‌డీఎస్‌హెచ్) పాఠశాల విద్యార్థులు సామూహిక పారాయణాన్ని పఠించారు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పది రోజుల పాటు విష్ణుసహస్రనామ పారాయణలో శిక్షణ పొందిన విద్యార్థులు శుక్రవారం సింహగిరి ప్రధాన రాజగోపురానికి సమీపంలోని కళా వేదికపై వీనులకు ఇంపుగా పారాయణన్ని పఠించారు. అనంతరం విద్యార్థులకు ఆలయ అధికారులు స్వామివారి దర్శన భాగ్యం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పద్మనాభం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. విజయనగరం జిల్లా కోర్టు ఎదురుగా బీసీ కాలనీలో ఉంటున్న పల్లా పరదేశి (48) తమ స్వగ్రామమైన పొట్నూరుకు గురువారం సైకిల్‌పై బయలుదేరారు. ఉదయం 8.30 గంటల సమయంలో ఆయన చిన్నాపురం జంక్షన్ సమీపం సారికవారి కళ్లాల వద్దకు వచ్చేసరికి విజయనగరం నుంచి ఆనందపురం వెళ్తున్న సాయిగణపతి కళాశాలకు చెందిన బస్సు ఢీకొంది. దీంతో పరదేశి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడపడం వల్లే ప్రమాదం చోటుచేసుకుంది. పరదేశికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పరదేశి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి సీఐ శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ స్త్రీమూర్తులకు నిలయం భారతావని: బ్రహ్మశ్రీ చాగంటి

కొమ్మాది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ పాతివ్రత్యం, నడవడిక, తపశ్శక్తిచేత దేవతా కార్యాలను సైతం సాధించి, అనావృష్టిని నివారించిన మహోన్నతమైన స్త్రీమూర్తులు ఈ దేశంలో ఉన్నారనే విషయాన్ని శ్రీరామాయణం తెలియజేస్తుందని ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ఉపదేశించారు. కొమ్మాదిలో కొనసాగుతున్న ప్రవచన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అయోధ్య కాండలోఅనసూయమ్మను సీతమ్మ కలసినప్పుడు వారిరువురి మధ్య సంభాషణ అనేక స్త్రీ ధర్మాలను ఆవిష్కరిస్తుందని పేర్కొన్నారు.

వైభవంగా దుర్గమ్మ గుడి ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

ఆనందపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో శుక్రవారం దుర్గమ్మతల్లి గుడి ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 6 నుంచి అమ్మవారికి పూజా కార్యక్రమాలు చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. మహిళలు కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం మూడు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక నాయకులు బంక శ్రీను, బంక సత్యనారాయణ, పాండ్రంకి అప్పలరాజు, మతికాన ఆదినారాయణ, జట్టినాయుడు, గురునాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

15లోగా పంట నమోదు చేసుకోవాలి : ఎంవీ చలం

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేస్తున్న వరి, ఇతర పంటలు వేసిన రైతులు ఈ నెల 15లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎంవీ చలం సూచించారు. మండలంలో మద్ది, బాందేవుపురం, వీకేపాలెం, పద్మనాభం తదితర గ్రామాల్లో ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రబీలో వేసిన ప్రతి పంటను నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసిన పంటకు అధికారిక గుర్తింపు ఉంటుందని, రైతు పండించిన ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు అర్హత పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

'పది'లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

» జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్

పద్మనాభం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చి, వారిని ఏ, బీ గ్రేడ్‌లకు తీసుకువచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కూడా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ నెల పదిన నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈవో అన్నారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ కాసేపు విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు.



విద్యార్థులతో సరదాగా మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

సాంకేతిక ప్రగతిపై అవగాహన పెరగాలి: గీతం వీసీ డిసౌజా



సదస్సులో పాల్గొన్న వక్తలు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ముందుకు సాగితే ఉద్యోగావకాశాలు లభిస్తాయని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా అన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు-నైపుణ్యాలు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్స్ (సీహెచ్‌ఆర్‌వో) సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ యుగంలో కార్పొరేట్ సంస్థల పనితీరు మారుతోందని, అందువల్ల విద్యార్థులకు విషయ పరిజ్ఞానంతో పాటు పని సంస్కృతి, సంస్థల పనితీరు, ఇతరులతో కలిసి లక్ష్యాలను సాధించే నైపుణ్యం అవసరమన్నారు. గీతం ఇన్నోవేషన్ అధికారి ఎన్.క్రిష్ మాట్లాడుతూ విద్యార్థులకు గీతంలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం నుంచే సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ తప్పనిసరి చేశామన్నారు. కార్పొరేట్ రంగంలో వస్తున్న మార్పులకు తగ్గట్టుగా యువత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఎవోక్ టెక్నాలజీస్ ఉపాధ్యక్షుడు రమేశ్ మంతన మాట్లాడుతూ కాలానుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సిస్కో సంస్థ ప్రతినిధి ఈస్విందర్‌సింగ్, కెఫిన్‌టెక్ సంస్థ ఉపాధ్యక్షుడు కె.సాయిగౌతమ్, డీజీఫ్యాక్ సంస్థ సీఈవో బి.విష్ణు, గీతం సీఎస్‌ఈ విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ శాంతి, ఇన్ఫోసిస్ విశాఖ అధిపతి ఎన్.సురేశ్, క్యాట్‌లాగ్ సంస్థ మేనేజర్ సిరిచెందనరెడ్డి, కానిని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీనియర్ మేనేజర్ ప్రియామాలిని, తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న న్యూటన్, తనయులు, తదితరులు

పోతుల న్యూటన్ మాస్టార్ విగ్రహావిష్కరణ

భీమునిపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సీబీఎం ఎయిడెడ్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయునిగా, కరస్పాండెంట్‌గా పనిచేసిన దివంగత పోతుల న్యూటన్ మాస్టార్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. మాస్టార్ విగ్రహాన్ని ఆయన పెద్ద కుమారుడు, ఎస్‌బీఐ అధికారి కృపారావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పీజీకే వర్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 1969 నుంచి 1999 వరకు న్యూటన్ మాస్టార్ పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాస్టార్ రెండో కుమారుడు, సీనియర్ అడ్వకేట్ పి.సుందర్‌సింగ్, కుమార్తె మమ్మీ టీచర్, కరస్పాండెంట్ పీఏవీ కుమారి, వీఎస్ చంద్, పట్టణ ప్రముఖులు ఎం.షణ్ముఖరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ వేసేందుకు వెళుతున్న శ్రీనివాసులనాయుడు, తదితరులు

అట్టహాసంగా గాదె శ్రీనువాసులునాయుడు నామినేషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లి కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

సింహాచలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధి టీవీ టవర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్లు, రహదారుల నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ పీవీ నరసింహం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం



పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయం కొండదిగువ పూదోటలోని పద్మావతి, అలిమేల్ మంగా సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలకు సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. ఉత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయ ముఖమండపంలో స్థానాచార్యులు డా.టి.పి.రాజగోపాల్ పర్యవేక్షణలో పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి వేదపారాయణలకు రుత్విక్‌లకు రుత్విక్ వరుణలిచ్చారు. అర్చకులు ఐ.పవన్‌కుమార్, జి.భార్గవ్ తదితరులు సమీపంలోని వల్మీకం(పుట్ట) నుంచి వేదమంత్రోచ్ఛరణల నడుమ మృత్తిక (మట్టి)ని సేకరించారు. దానిని ఆలయంలో ప్రత్యేక ఆసనంపై ఉంచి భూసూక్త పారాయణలతో పూజలు చేశారు. ఆ మృత్తికను మట్టిపాలకల్లో ఉంచి ముందుగా క్షీరంలో ఉంచిన నవధాన్యాలను మృత్తికలో వేసి అంకురార్పణం చేసి పాలకలకు మంగళ హారతులివ్వటంతో తొలిరోజు కార్యక్రమాలు ముగిశాయి. శనివారం భీష్మఏకాదశి పుణ్యదినాన సాయంత్రం కొండదిగువ గ్రామంలో తిరువీధి జరిపిన తరువాత తిరుకల్యాణోత్సవం జరిపేందుకు అధికారులు సన్నాహాలు పూర్తిచేశారు.

'బీసీ ఉప కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం జాతీయ కార్యదర్శి ఎం.ఎస్.రావు తదితరులు

ఆనందపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న తూర్పు కాపు, శిష్ట కరణం, కళింగవైశ్య, సొండి తదితర సుమారు 80 బీసీ ఉప కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఏపీ ప్రభుత్వానికి కాపు సంఘం జాతీయ కార్యదర్శి ఎం.ఎస్.రావు , బీజేపీ విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓబీసీ జాబితాలో వీరిని రాష్ట్ర ప్రభుత్వం చేర్చే వరకు తమ ప్రయత్నం కొనసాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటే అత్యధికంగా ఉన్న బీసీలే కారణమని, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ఓబీసీ జాబితాలో లేని ఈ కులాల్లో ఉన్నవారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉపాధి కోల్పోవలసి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాము పాల్గొన్నారు.

నియామకాలు: గండిగుండం పంచాయితీలో జాతీయ కాపు సంఘం కమిటీ నియామకాలు చేపట్టారు. అధ్యక్షుడిగా ముమ్మన శ్రీను, ఉపాధ్యక్షుడిగా గవర సోంబాబు, ప్రధాన కార్యదర్శిగా గండ్రెడ్డి సోమినాయుడులను ఎంపిక చేశారు. వీరికి ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.రావు, బి.రాము నియామక పత్రాలను అందజేశారు.

ఏజెన్సీలో బహుపరాక్



అధికారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

కొమ్మాది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహించేటప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. పోలీసులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్.పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు పి.సత్యం, వి.నారాయణ, బి.రామకృష్ణ, ఆర్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలతో సంగీతం పరిధి విస్తరణ

గీతంలో సంగీత సోదరీమణులు రజని, గాయత్రిల మనోగతం



ఛేంజ్ మేకర్స్ కార్యక్రమంలో సంభాషిస్తున్న కర్ణాటక సంగీత విద్వాంసులు రజని, గాయత్రి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల ప్రభావంతో శాస్త్రీయ సంగీతం పరిధి విస్తరించి ప్రతి ఒక్కరినీ చేరుతోందని, గురుముఖంగా నేర్చుకునే శిక్షణకు, ఆన్‌లైన్ శిక్షణకు మధ్య గల వ్యత్యాసం కాలక్రమంలో తెలుస్తుందని ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు, సోదరీమణులు రజని, గాయత్రి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఛేంజ్ మేకర్స్ పేరిట శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల వల్ల సంగీత శిక్షణ కొత్త మార్పులకు దారి తీస్తోందన్నారు. చిన్న వయస్సులోనే సంగీత సాధన ప్రారంభించినప్పటికీ నేటికీ కొత్త అంశాలు నేర్చుకోవడానికి నిత్య విద్యార్థులుగా ఉంటున్నామని తెలిపారు. శాస్త్రీయ సంగీత శిక్షణ కాలానుగుణంగా మార్పుచెందాలని, ముఖ్యంగా నేర్చుకునే వారిలో ఆసక్తిని పెంచేలా బోధన విధానం మార్పు చెందాల్సి ఉందన్నారు. ఉమ్మడిగా సంగీత కచేరి చేయడం రెండు వైపులా పదునున్న కత్తి వంటిదని, అయితే ఎప్పటికప్పుడు ముందస్తు సాధన, విశ్లేషణ ద్వారా సమన్వయం సాధిస్తూ కచేరీలు చేస్తున్నామని వారు తెలిపారు. భారతీయ సంగీతంలో విదేశీ సంగీత ఉపకరణాలు ఉపయోగించడం వల్ల నష్టం లేదని, ఎంత నేర్పుగా వాటిని ఉపయోగించాలో తెలిసి ఉండాలన్నారు. సంగీత సాధనలో మార్పు తేవాలనుకునే వారు మూలాలను చెడకుండా నిజాయతీతో కృషి చేయాలన్నారు. 35 సంవత్సరాలుగా కలసి సంగీత సాధన, కచేరీలు చేయడం వెనుక సంయుక్త కృషి, పరస్పర నమ్మకం కారణమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంధానకర్తగా గీతం పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం అధిపతి డాక్టర్ అముక్తమాల్యద వ్యవహరించారు. ఈ సందర్భంగా రజనీ, గాయత్రీలను గీతం వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎరోల్‌డిజౌజా, విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ కె.బాలాకుమార్‌లు సన్మానించారు.

హయగ్రీవకు ఈడీ షాక్

... 5వ పేజీ తరువాయి

కొద్దిరోజులు ఆగి పనుల నిలిపివేతపై ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న జి.వెంకటేశ్వరరావు కోర్టును ఆశ్రయించారు. పనులకు ఆటంకం కల్పించవద్దని కోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో ఏప పత్రాలు అవసరమో సూచిస్తూ జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అందులో కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ కూడా ఉండాలని పేర్కొన్నారు. దాంతో జి.వెంకటేశ్వరరావు మరోసారి ఆన్‌లైన్‌లో ప్లాన్ ప్రతిపాదనలు సమర్పించారు. జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ దానిని పరిశీలించి ఎటువంటి మధ్యంతర ఉత్తర్వులు అమలులో లేవని, అయితే రిట్ పిటిషన్ 160/2022, 191/2022 తీర్పులకు లోబడి పనులు చేసుకోవాలని సూచించింది.

సెల్ఫీ వీడియో కలకలం

ఇదిలావుండగా జగదీశ్వరుడు 2021 డిసెంబరు 19న ఒక సెల్ఫీ వీడియో రిలీజ్ చేశారు. జి.వెంకటేశ్వరరావు, మరికొంతమంది కలిసి తన భూమిని లాక్కున్నారని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, ప్రాణ హాని కూడా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తీవ్ర సంచలనం కలిగించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించి, భాగస్వాముల మధ్య విభేదాలు ఉన్నాయని బిల్డింగ్ ప్లాన్ అనుమతిని రద్దు చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆయన ప్రత్యేకంగా కోరారు. యాజమాన్య హక్కులపైనే వివాదం తలెత్తినందున అనుమతులన్నీ అబెయెన్స్‌లో పెట్టాలని, కోర్టు నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకోవాలని, అంతవరకు పనులు ఆపేయాలని సూచిస్తూ జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

ప్రభుత్వం మారాక పోలీసు కేసు

గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో జగదీశ్వరుడుకు కొంత ధైర్యం వచ్చింది. విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు, గద్దె బ్రహ్మాజీపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భార్యను బెదిరించి ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకోవడంతోపాటు తమ సంతకాలను ఫోర్జరీ చేసి తన భూమిని కబ్జా చేశారని 2024 జూన్ 22న ఫిర్యాదుచేశారు. తీవ్రమైన ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలో దిగింది. లోతుగా విచారణ చేసింది. అందులో భాగంగా ఎంవీవీ సత్యనారాయణ ఇళ్లలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకుంది. ఈ భూమిని ఎనిమిది మందికి అమ్మడానికి జగదీశ్వరుడు ప్రయత్నించాడని తేల్చింది. అలాగే ఎంవీవీ బిల్డర్స్, జి.వెంకటేశ్వరరావు, బ్రహ్మాజీలు కలిసి ఈ భూమి ద్వారా రూ.87.64 కోట్లు సంపాదించారని, ఆ మొత్తాన్ని స్వప్రయోజనాలకు వాడుకున్నారని తేల్చింది. అందుబాటులో ఉన్న వారి స్థిరచరాస్తులు రూ.44.75 కోట్ల విలువైనవి స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణం ఆగిపోయింది.

రూ.40 కోట్లతో పంచాయతీల అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ప్రణాళికలు రూపొందించారు. ప్రణాళికల్లో పేర్కొన్న పనులు చేపడితేనే బిల్లులు మంజూరవుతాయి. వాటిల్లో లేని పనులు చేస్తే బిల్లులు ఇవ్వరాదని కేంద్రం ఆదేశించిందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీలు ప్రతిపాదించిన పనుల వివరాలు పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. సాధారణంగా పారిశుధ్యం, తాగునీరు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, డ్రైన్లు, తదితర పనులకు నిధులు కేటాయిస్తుంటారు.

కోడి వ్యర్థాల సేకరణ టెండర్లలో గోల్‌మాల్

... 5వ పేజీ తరువాయి

సూచన మేరకు ఒక్కో ప్రజాప్రతినిధి సూచించిన వారికి ఒక్కో జోన్ చొప్పున ఎనిమిది జోన్లను సర్దుబాటు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు పిలిచిన అధికారులు అందరి సమక్షంలోనే టెక్నికల్ బిడ్‌ను, తర్వాత ఫైనాన్స్ బిడ్‌ను ఓపెన్ చేసి ఎవరు అర్హత సాధించారు, ఎవరు ఆమోదయోగ్యమైన ధరకు కోట్ చేశారనేది చూసి కాంట్రాక్టర్‌ను ఎంపికచేయాలి. కానీ ప్రజాప్రతినిధుల జోక్యంతో అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్‌ను పక్కనపెట్టేసి ప్రజా ప్రతినిధులు సూచించిన వారికి అనధికారికంగానే ఒక్కో జోన్ చొప్పున వర్క్ ఆర్డర్లు ఇచ్చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యర్థాలు సేకరించే వారంతా కాపులుప్పాడ యార్డుకు కాకుండా చేపల చెరువులకు తరలిస్తున్నాసరే తాము చోద్యం చూడాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు.

రాజమండ్రిలో మాదిరిగా చికెన్ వ్యర్థాలను పర్యావరణ హితంగా ప్రాసెస్ చేసి ఎరువుగా మార్చే యూనిట్‌ను కాపులుప్పాడలో ఏర్పాటుచేయాలని గత కమిషనర్ సంపత్‌కుమార్ భావించారు. అందుకోసం రాజమండ్రిలో యూనిట్‌ను ఏర్పాటుచేసిన సంస్థకు కాపులుప్పాడలోని యార్డులోని ఐదెకరాలు కేటాయించారు. ఆ సంస్థ జీవీఎంసీకి ఏటా రూ.1.5 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. ఆ దిశగా ఒప్పందం చేసుకుంటారనుకుంటున్న సమయంలో సంపత్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. దాంతో ఆ యూనిట్ ఏర్పాటు మరుగునపడినట్టేనని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు పైసా వసూల్!

... 5వ పేజీ తరువాయి

వసూలు చేసినట్టు తెలిసింది.

అక్రమాలకు పాల్పడితే చర్యలు: ఆర్‌ఐఓ

పరీక్షల నేపథ్యంలో నగదు వసూళ్లపై ఆర్‌ఐవో మురళీధర్‌ను వివరణ కోరగా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే ఆయా కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలకు నియమించిన సిబ్బంది ఎలాంటి అక్రమాలకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాంది ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లు అందజేత

తగరపువలస, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు గుగ్గిలపు భార్గవి, కె.సంధ్య మాట్లాడుతూ ఈ కిట్‌లను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ఉదయ్‌కుమార్, రామలక్ష్మి, సావిత్రి, మాధవి, భీమాబాయ్, పద్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయంలో అన్నప్రసాద వితరణ ప్రారంభం

సింహాచలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి సహోదరి, అడవివరం గ్రామ దేవత సత్తెమ్మతల్లి (మరిడమ్మ) ఆలయంలో భక్తులకు అన్న ప్రసాద పథకానికి శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశాక అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అమ్మవారి దర్శనార్థం అమ్మవారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారన్నారు. అందువల్ల ఇకపై ప్రతి శుక్రవారం రెండు వందల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం

ఆనందపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిగుండం ముత్యాలమ్మ తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం జెడ్పీ చైర్మన్, వైసీపీ 'భీమిలి' కన్వీనర్ చిన్న శ్రీను అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావాలను పెంపొందించుకుని సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనివాసరావు, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, జడ్పీటీసీ కోరాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

గాజువాక, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, అందరూ క్రీడా స్ఫూర్తితో మెలిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గంగవరం మైదానంలో శుక్రవారం నిర్వహించిన సూపర్ 11 లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వారం రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు, ద్వితీయ స్థానానికి రూ. 20 వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి పది వేల రూపాయలతో పాటు ట్రోఫీలు అందజేస్తామన్నారు. క్రీడాకారులు రాజు, పాత్రాజు, సతీశ్, నాగేంద్ర, కార్తీక్, ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లకు బదిలీ సౌకర్యం

» ప్రాంతాలు మారే లబ్ధిదారులకు మేలు
» ఎక్కడైనా పింఛన్ తీసుకునే అవకాశం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పింఛన్ దారులకు మ్యాపింగ్ నమోదైన సచివాలయ పరిధిలోనే పింఛన్ అందుకోవాలి. దీనివల్ల ప్రతి నెలా ఒకటో తారీఖున లబ్ధిదారులు మ్యాపింగ్ చేసిన ఇంటికి ఉరుకులు, పరుగులు పెడుతుంటారు. అయితే ఈ సమస్యకు చెక్ చెప్పేలా ప్రభుత్వం కల్పించిన బదిలీ సౌకర్యంతో ఇలాంటి వారందరికీ మేలు కలుగనుంది. జీవీఎంసీ జోన్-3 పరిధిలో 15,099 పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరు ఉంటున్న ఇంటి చిరునామాతో పింఛన్లు మంజూరయ్యాయి. వీరిలో చాలా మంది ఇతర ప్రాంతాలకు చెందినవారున్నారు. ఇక్కడ ఎక్కువగా అద్దె ఇళ్లల్లో నివాసం ఉన్న వారు కావడంతో తరచూ ఇల్లు మారుతుంటారు. కానీ పింఛన్ సమయానికి పాత ఇంటికే వచ్చి నగదు పొందాల్సి వుంటుంది. వీరే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వాసులు కూడా ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి జోన్-3 పరిధిలో జీవనం సాగిస్తున్నారు. వారి ఇళ్లల్లో వృద్ధులు, వికలాంగులకు ఇక్కడి చిరునామాల ప్రకారం పింఛన్లు పొందుతున్నారు. కొంతమంది సొంతూళ్లకు వెళ్లిపోయినా ప్రతి నెలా ఒకటో తేదీన ఇక్కడకు రావాల్సివుంటుంది. అంతేకాకుండా జోన్-3 పరిధి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు నెలా నెలా వృద్ధులను తీసుకుని రావడానికి ప్రయాసపడుతున్నారు. దీనికితోడు రవాణా చార్జీలకు అధికమొత్తంలో చేతిచమురు వదులుతోంది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతంలో నివాసముంటున్న వారు పింఛన్ బదిలీ చేయించుకుని అక్కడే నగదు తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.


పింఛన్ తీసుకుంటున్న వృద్ధురాలు (ఫైల్ ఫొటో)

సచివాలయంలో బదిలీ ప్రక్రియ..

సచివాలయాల్లో ఎన్టీఆర్ పింఛన్ బదిలీ చేసుకోవచ్చు. ప్రతి నెలా 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పింఛన్ల వెబ్‌సైట్‌లో బదిలీ ఆప్షన్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఎక్కడకు బదిలీ చేయాలో అక్కడ చిరునామా ఇవ్వాలి. నివాసం ఉంటున్న జిల్లా, మండలం, సచివాలయం కోడ్ నమోదు చేయాలి. దీంతో బదిలీ చేసుకున్న సచివాలయానికి లబ్ధిదారుని రిక్వెస్ట్ వెళ్తుంది. అక్కడ కార్యదర్శి యాక్సెప్ట్ చేసి మరుసటి నెల నుంచి పింఛన్ పంపిణీ చేస్తారు.

ఇతర ప్రాంతాల వారికి మేలు

పింఛన్ బదిలీతో ఇతర ప్రాంతాల లబ్ధిదారులకు మేలు కలుగుతుంది. ప్రతి నెలా పాత చిరునామాకు రావడానికి చార్జీలు వెచ్చించి ప్రయాసపడే బాధ తప్పుతుంది. బదిలీ దరఖాస్తు చేసుకుంటే వారున్న ప్రాంతంలోనే పింఛన్ పొందవచ్చు. ఈ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలి.

- లంకాడ రాము, ఏపీడీ, జీవీఎంసీ జోన్-3

ఎంవీవీ పీక్ నిర్మాణాలు నిలిపివేయాలి

» జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

సిరిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలోని ఎంవీవీ పీక్ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు శుక్రవారం మేఘలయా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సీబీసీఎన్‌సీ ఆస్తులను అన్యాయంగా లాక్కున్నారని ఆరోపించారు. దీనికి దొడ్డిదారిన టీడీఆర్ తీసుకున్నారని, 15, 826 చదరపు అడుగుల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనం నిర్మించాలని హెచ్ఆర్ఆర్ అనే సంస్థ పేరుతో ప్లాన్ పెట్టారన్నారు. ప్లాన్‌కు ఆమోదం రాకుండానే నిర్మాణ పనులను చేపడుతున్నారని విమర్శించారు. ఎంవీవీ పీక్ పేరిట జరుగుతున్న నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదని, దొంగ దస్తావేజులు సృష్టించి 1.93 సెంట్లు రూ.129 కోట్ల టీడీఆర్ కొట్టేశారని ఆరోపించారు. కాకినాడలో సుమారు రూ.129 కోట్లు, విశాఖలో రూ.64 కోట్లు కొట్టేసి దీనిని నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.200 కోట్ల జీవీఎంసీ ఆదాయం స్వాహా చేశారన్నారు. దీనిపై ఈడీ విచారణ చేయాలని కోరారు. సీబీసీఎన్‌సీ భూముల్లో అక్రమాలపై న్యాయ పోరాటం కూడా చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటినా కొందరు అధికారులు వైసీపీ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మూర్తియాదవ్

ఆర్గానిక్ కాంపౌండ్స్ శుద్ధీకరణపై జాతీయ వర్క్‌షాప్


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో 'ఆధునిక సాంకేతికతలో ఆర్గానిక్ కాంపౌండ్స్ శుద్ధీకరణ, లక్షణాల గణన' అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ను శుక్రవారం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్.రాజు ప్రారంభించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు బి.ఉదయ్‌కుమార్ ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఔషధాలుగా ఆర్గానిక్ కాంపౌండ్స్, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజు వివిధ రంగాల్లో రసాయనశాస్త్రం ప్రాధాన్యత తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు కన్వీనర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ వి.సిద్ధయ్య ఆర్గానిక్ కాంపౌండ్స్ శుద్ధి చేయాల్సిన అవసరం, ఫలితాలపై వీటి ప్రభావాన్ని పేర్కొన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో ఎన్‌విడా బయోసైన్సెస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి.సుబ్బరాజు ఆర్గానిక్ కాంపౌండ్ శుద్ధీకరణ, లక్షణాల గణన సాంకేతికతలపై ఉపన్యాసం ఇచ్చారు. ప్రొఫెసర్లు శివరావు, శైలజ, బసవయ్య, డాక్టర్ వి.క్రిస్టోఫర్, డాక్టర్ కమల తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో పనిచేయని బోరు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 18 వార్డు పరిధిలోని వెంకోజీపాలెం శ్మశానవాటికలో నీటి ఎద్దడి నెలకొంది. వెంకోజీపాలెం, ఇసుకతోట, అటు హనుమంతువాక, క్రాంతినగర్, సంజయ్‌గాంధీకాలనీ, రామాలయం వీధి తదితర ప్రాంతాలకు ప్రధాన శ్మశానవాటిక ఇది. ఇక్కడ నీటి అవసరం చాలా ఉంది. వాటిలోనున్న బోరు మరమ్మతు పాలవడంతో కొద్ది రోజులుగా అంత్యక్రియలకు వచ్చే వారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మరో ప్రత్యామ్నాయం లేక హనుమంతువాక లేదా వెంకోజీపాలెం వరకూ వెళ్లి 20 లీటర్ల ట్యాంక్ నీటిని కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తక్షణం బోరును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.



25 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

సీతంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని, ఆటో సహా పట్టుకున్నట్లు నాలుగో పట్టణ పోలీసులు చెప్పారు. జ్ఞానాపురం రాసా వీధికి చెందిన తనవరపు రమణ (46) పలువురి వద్ద రేషన్ బియ్యం కిలో రూ.11, రూ.12లకు కొనుగోలు చేసి నల్లబజారులో అమ్ముతుంటాడు. ఈ క్రమంలో 25 బస్తాల బియ్యాన్ని శుక్రవారం తెల్లవారు జామున ఆటోలో తరలిస్తుండగా, రాత్రి విధులు నిర్వహిస్తున్న నాలుగో పట్టణ ఎస్ఐ కె.సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి బియ్యాన్ని పట్టుకొని పోలీసు స్టేషన్‌కి తరలించారు. సీఐ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమంగా తరలిస్తున్న 1,194 కిలోల బియ్యంతో పాటు తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

కొండవాలు ప్రాంతంలో దుకాణాలను తొలగించాల్సిందే

» యజమానులను ఆదేశించిన ఉక్కు సిబ్బంది

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో స్టీల్‌ప్లాంటు స్థలాలకు ఆనుకుని రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలని యజమానులను ఉక్కు కర్మాగార సిబ్బంది ఆదేశించారు. శుక్రవారం ఈ ప్రాంతాలలో పర్యటించి వ్యాపారులతో మాట్లాడారు. స్వచ్ఛందంగా ముందుకురాకుంటే బడ్డీలను తామే తొలగిస్తామన్నారు. అలాగే సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో మూతపడిన పంప్‌హౌస్ ప్రాంతంలో బడ్డీల వెనుక అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, వెంటనే వాటికి స్వస్తి పలకకుంటే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్‌బీకాలనీ రోడ్డులోని స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై పండ్లు విక్రయిస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్న ఆటోను తొలగించారు. స్టీల్‌ప్లాంట్ స్థలాలను ఆక్రమిస్తే ఇకపై సహించేదిలేదని ఎస్టేట్ అధికారి జగన్నాథరావు హెచ్చరించారు.


దుకాణదారులను హెచ్చరిస్తున్న స్టీల్ సిబ్బంది


రహదారికి అడ్డుగా ఉన్న ఆటోను తొలగిస్తున్న దృశ్యం

కళాభారతిలో అలరించిన నాటికలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నాటక ప్రదర్శనలు అలరించాయి. జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ కళాకారులు ప్రదర్శించిన మేము మనుషులమే నాటిక ఆకట్టుకుంది. ట్రాన్స్‌జెండర్స్ కూడా మనుషులుగా గుర్తించి వారికి సమాజంలో స్థానం కల్పించాలనే సందేశం ఇచ్చారు. మరో నాటిక చిటారు కొమ్మన మిఠాయి పొట్లాం హాస్యభరితంగా సాగింది. కళాకారులు డైలాగ్స్‌కు ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వారు. ముందుగా నాటక ప్రదర్శనలను అకాడమీ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి రాంబాబు, సన్యాసిరావు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మేము మనుషులమే నాటికలో ఓ సన్నివేశం

ముడసర్లోవ పార్కుకు ప్రహరీ నిర్మించేదెన్నడో?


ముడసర్లోవ పార్కు ప్రహరీ గోడకు కట్టిన కర్రలు

ఆరిలోవ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సిద్ధమైన ముడసర్లోవ పార్కులో హుదూద్ సమయంలో కూలిపోయిన ప్రహరీని నేటి వరకు పునర్నించకపోవడంపై సందర్శకులనుంచి విమర్శలు తలెత్తుతున్నాయి. ముడసర్లోవ రిజర్వాయర్ చుట్టూ మూడేళ్ల కిందట కోట్లాది రూపాయల జీవీఎంసీ నిధులతో ప్రహరీ కట్టారు. కానీ, ఈ పార్కులో పదేళ్ల కిందట కూలిన ప్రహరీని ఇంతవరకు పట్టించుకోలేదు. ఈ పార్కుని ఏటా లక్షలాది రూపాయలకు సంబంధిత కాంట్రాక్టర్‌కు లీజుకు ఇస్తుంటారు. దీని వల్ల ఆదాయం వస్తున్నా జీవీఎంసీ అధికారులు ప్రహరీ నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో విమర్శలు తలెత్తున్నాయి. ఈ పార్కుని సందర్శించడానికి నిత్యం నగర వాసులతో ఇతర ప్రాంతాలనుంచి పర్యాటకులు వస్తుంటారు. కానీ అభివృద్ధిపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. గత వైసీపీ పాలకులు ఈ పార్కుని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పలుమార్లు అధికారులు వచ్చి పరిశీలించారు. కానీ, అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు. కనీసం కూలిన గోడలనైనా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

సెంట్రల్ జైలు వద్ద జోరుగా ఉత్పత్తుల విక్రయాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రకారాగారం ప్రధాన గేట్ వద్ద ఏర్పాటు చేసిన సుధార్ కేంద్రం వద్ద వివిధ రకాల ఉత్పత్తుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కూరగాయలతోపాటుపిండివంటలు, దుప్పట్లు, టవల్స్, బెడ్ షీట్లు, ఫినాయిల్, ఆవుపేడతో చేసిన పిడకలను అమ్ముతున్నారు. అన్ని కేంద్రకారాగారాల్లో ఖైదీలు తయారుచేసిన ఉత్పత్తులను బహిరంగ మార్కెట్‌కన్నా తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. కౌంటర్లలో ఇద్దరు ఓపెన్ ఖైదీలు ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటలవరకు విక్రయిస్తున్నారు. ఈ ఆదాయాన్ని జైలు సంక్షేమ నిధికి జమ చేస్తామని జైలు సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం


వెంకటేశ్వరస్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీ వెంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం వార్షిక కల్యాణం శోభాయమానంగా నిర్వహించారు. చతుస్థానార్చన, నిత్యపూర్ణాహుతి, స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పట్టువస్త్రాల సమర్పణ, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 తేదీ వరకూ నిర్వహించనున్నారు. శనివారం తులసీదళార్చన, పండిత సదస్యం, ఆదివారం కుంభప్రోక్షణం, ఈ నెల 12న శ్రీ ఉమారాలింగేశ్వరస్వామివారి 41వ ప్రతిష్ఠా వార్షిక కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

అంతర్జాతీయ అవార్డు ఆనందాన్నిచ్చింది

'హ్యాట్సాఫ్' ఫేం యాదవ్‌కుమార్



సిరిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నటనపై ఆసక్తితో రాణిస్తున్నారు యాదవ్ కుమార్. ఈ క్రమంలో ఆయన దర్శకత్వం వహించిన 'లైఫ్' గుర్తింపు తెచ్చింది. సినిమాలకే పరిమితం కాకుండా లఘుచిత్రాలు ప్రారంభించారు.'హ్యాట్సాఫ్' లఘు చిత్రంలో ఆయన నటించిన పోలీసు పాత్రకు అంతర్జాతీయ అవార్డు రావడంతో నటనా ప్రతిభ వెలుగుచూసింది.

ప్రశ్న: దర్శకుడు, నటుడు ఏది బాగుంది?

సమాధానం: దర్శకుడిగా రాణించాలన్నదే నా కల. మూడు చిత్రాలకు దర్శకత్వం వహించాను. 'లైఫ్' పెద్ద హిట్‌గా నిలిచింది. విశాఖలో ఉండడంతో నగర కళాకారులకు అవకాశం కల్పిస్తుంటా. 'హ్యాట్సాఫ్' లఘు చిత్రం కథను దర్శకుడు జీవీ త్రినాథ్ చెప్పినప్పుడే పోలీస్‌పాత్రలో నటించాలనుకున్నా. నేషనల్ అవార్డు రావడంతో సంతృప్తి లభించింది.

ప్ర: ఈ అవార్డు వస్తుందనుకున్నారా?

స: అంతర్జాతీయ అవార్డు రావడం ఆనందాన్నిచ్చింది. హ్యాట్సాఫ్‌లో పోలీస్ పాత్ర సమాజాన్ని మేల్కొపేలా ఉంటుంది. అవార్డు ఊహించలేదు.

ప్ర: భవిష్యత్తులో ఎలాంటి చిత్రాలు ఆశించవచ్చు?

స: లఘు చిత్రాలు తీస్తుంటా. ప్రస్తుతం కంచర్ల చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నా. నగర కళాకారులను ప్రోత్సహించేలా మంచి కథతో సినిమా తీస్తాను.

12న జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 12న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నామని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం సీఈవో జి.గోపీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనేవారు జనవరి ఒకటి, 2005న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు వయసు ధ్రువీకరణ పత్రంతో సహా సాయంత్రం 4 గంటలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియం హ్యాండ్‌బాల్ కోర్టులో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైనవారు ఈ నెల 21 నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు 9393996660 ఫోను నంబరులో సంప్రదించాలన్నారు.

సినిమా గైడ్

● **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
● **భవానీ వార్డ్:** జగదాంబ, రమాదేవి
● **మదగజరాజ:** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 13, వంకాయలు(తెలుపు) 18,వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 42, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 100, అల్లం 42, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోసకాయలు 22, వెల్లులి 170, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 38, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 38, కంద 56, దేముడుచిక్కుడు 32, గోరుచిక్కుడు 28, కూరపెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

క్రీడలతో ఉద్యోగులకు ఉపశమనం: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే వెలగపూడిని సత్కరిస్తున్న ఉద్యోగులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఒత్తిడి ఎదుర్కొనే ఉద్యోగులకు శారీరక, మానసిక ఉల్లాసానికి ఆటవిడుపు ఉండాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఈపీడీసీఎల్ పరిధిలోని 15వ వార్డు హెచ్‌బీ కాలనీ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్‌శాఖ ఉద్యోగుల యూనియన్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి ఆటగాళ్లను అభినందించారు. ఉద్యోగంలో ఒత్తిడికి లోనయ్యే ఉద్యోగులకు ఆటలు ఊరటగా ఉంటుందన్నారు. పోటీల్లో 20 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉద్యోగులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, సీతమ్మధార ఏడీఈ జ్యోతి, గణపతి, గురునాథరావు, చిరంజీవి, నూకరాజు, శ్రీనివాసరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన ముఖ్య కార్యదర్శి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఎంవీపీ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ కేంద్రంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న డీఎస్సీ కోచింగ్ తీరుతెన్నులపై ప్రశ్నించారు. నాణ్యమైన బోధన, మెరుగైన ఫలితాల కోసం కృషిచేయాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ, బీసీ కార్పొరేషన్లలో సిబ్బంది తమ సమస్యల సాధనకు వినతి పత్రాలను అందించారు. ఈ కార్య క్రమంలో బీసీ సంక్షేమ, సాధికారిక అధికారిణి శ్రీదేవి పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న సత్యనారాయణ

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

ఆరిలోవ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తానని శాసన మండలి పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి అన్నారు. ఆరిలోవ, తోటగరువు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఆమె ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు నిధుల కోత విధిస్తోందన్నారు. పాఠశాల విద్యను అంగడి సరుకుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీతో ఉపాధ్యాయులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, పిల్లలు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో పని భారం, ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఈ సమస్యలపై మండలిలో గళమెత్తుతానన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్, ప్రజాసంఘాల నాయకులు నరేంద్రకుమార్, శంకర్, నాగరాజు, రంగమ్మ, రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


తోటగరువు ఉపాధ్యాయులతో విజయగౌరి

పార్కుల్లో సీసీ కెమెరాలతో నిఘా

» వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్


సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్

సిరిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ పార్కుల్లో రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. శుక్రవారం వీఎంఆర్డీఏ హాల్‌లో రెవెన్యూ, పరిపాలనా అలాట్‌మెంట్, సాంకేతిక, ప్రణాళిక విభాగాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి ఇంజనీరింగ్ పనుల అంచనాలను సమగ్రంగా రూపొందించాలని ఆదేశించారు. భూ వినియోగ మార్పిడి దరఖాస్తులను, సిబ్బంది వ్యక్తిగత లాగిన్‌లో ఉన్న దస్త్రాలను క్లియర్ చేయాలని సూచించారు. ఈసమావేశంలో కార్యదర్శి మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ శంకర్, చీఫ్ ప్లానర్ శిల్పా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికీ కూటమి మద్దతులేదు

» మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్


గాదె శ్రీనువాసులనాయుడుకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఇతర ప్రతినిధులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏ సంఘానికీ మద్దతు ప్రకటించలేదని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ స్పష్టంచేశారు. బీజేపీకి అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మాత్రమే గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతు తెలిపిందన్నారు. శుక్రవారం గాదె నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రాజమండ్రికి 178 మంది ఖైదీల తరలింపు

ఆరిలోవ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రకారగారం నుంచి రాజమండ్రి కేంద్ర కారాగారానికి ఇప్పటివరకు 178 మంది శిక్ష పడిన ఖైదీలను తరలించినట్టు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. శిక్ష ఖరారైన 200 మందిలో 178 మందిని మాత్రమే పంపిస్తామన్నారు. పలు సాంకేతిక కారణాలతో 22 మందిని రాజమండ్రి తరలించడంలేదన్నారు. రెండవ విడతలో మంచి నడవడిక గల మరికొంత మంది ఎంపుతామని తెలిపారు. వారిని కమిటీ ద్వారా ఎంపిక చేస్తున్నట్టు వివరించారు.

క్యాన్సర్‌పై అవగాహనకు 16న పింక్ సఖీ శారీవాక్

మహారాణిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. రోహిత్ మెమోరియల్ ట్రస్టు రౌండ్‌టేబుల్ లేడీస్ సర్కిల్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16న విశాఖలోని బీచ్‌రోడ్డులో నిర్వహించనున్న పింక్ సఖి శారీవాక్ కార్యక్రమం పోస్టర్‌ను మేయర్ ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శారీవాక్ కార్యక్రమం జరుగుతుందని, ఔత్సాహికులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ సమావేశంలో గురుద్వార్ సత్సంగ్ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్.ఆనంద్, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ మీనాక్షి అనంత్‌రామ్, పర్జానా బేగం, గుర్మిత్ కోహ్లీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర జిల్లా నోడల్ అధికారిగా డా.కె.వి.రమణ

కంచరపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర జిల్లా నోడల్ అధికారిగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ నియమితులయ్యారు.



జిల్లాలోని నాలుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 11 ప్రైవేటు కళాశాలల్లో ప్రతి మూడో శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను ఆయన పరిశీలిస్తారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన బాధ్యతను సమర్థంగా నెరవేరుస్తానన్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేస్తానన్నారు. డా.కె.వి.రమణను పలువురు అభినందించారు.

నాందీ ఫౌండేషన్ ఉదారత



అందుకున్న పుస్తకాల సంచులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది

కంచరపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కప్పరాడ ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సంచులు, రాత పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులు సుమారు 50 మందికి ప్రధానోపాధ్యాయిని విజయమాలిని వీటిని అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తీర్ణత కావాలని ఆకాంక్షించారు. నాంది ఫౌండేషన్ ప్రోత్సాహాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్‌పి ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలి సెమిస్టర్ ఫలితాలు విడుదల

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన తొలి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల శుక్రవారం విడుదల చేశారు. 76.34 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. అధ్యాపకులు ఉత్తీర్ణత వంద శాతానికి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు.

'నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు హర్షణీయం'



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేయడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోసూరు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు ఈ నిర్ణయం ఉపకరిస్తుందన్నారు. బీసీలకు రక్షణ చట్టం అమలు, స్థానిక సంస్థల్లోని 34 శాతం రిజర్వేషన్లపైనా త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితలకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేణికి పదోన్నతి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు అధికారిగా ప్రస్తుతం సేవలందిస్తున్న పి.ఎం.సత్యవేణి జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు.

మార్చి 2న తోడు-నీడ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పునర్వివాహం, వితంతు వివాహం కోరుకునే వారికి వచ్చే నెల 2న ఉచితంగా తోడు నీడ కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీఏ వీ రమణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదారి వెంకటరమణ తెలిపారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో ఆ రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు వాట్సాప్ నెంబరు 72073 74717ను లేదా కృష్ణా గార్డెన్స్‌లోని కార్యాలయంలోని సంప్రదించాలని కోరారు.

ప్రజాధనం దుర్వినియోగం తగునా?



మాధవధార అంబేడ్కర్ కాలనీలో ఆరంభమైన నిర్మాణ పనులు

మాధవధార, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలో కొన్నిచోట్ల నిర్మించిన భవనాలను సద్వినియోగం చేసుకోకుండా, పక్కనే మరొకటి నిర్మిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో 2024 ఎన్నికల ముందు కమ్యూనిటీ హాలు మంజూరైంది. ఇపుడు అదే చోట సచివాలయ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇదే చోట కాలనీ దారి పొడుగునా గతేడాది కట్టిన కళావేదిక ఇపుడు నిరుపయోగంగా మిగిలింది. ఆ భవనం పక్కనే ఇపుడు కొత్త నిర్మాణం కోసం పునాదులు తీస్తున్నారు. మంజూరైన కమ్యూనిటీ హాలు ఇప్పటికే ఉన్నందున, కాలనీవాసుల ఆహ్లాదం కోసం ఉద్యానవనం, జిమ్ పరికరాలతో సిద్ధం చేయాలని స్థానికులు కోరుతున్నారు. కమ్యూనిటీ హాలులో నడుస్తున్న 287వ సచివాలయాన్ని అదే భవనంలో కొనసాగించి, కాలనీవాసులకు పార్కు అభివృద్ధి చేయాలని సూచిస్తున్నారు. కాలనీవాసుల విన్నపాల్ని పట్టించుకోకుండా భవనం పక్కనే, మరో భవనం నిర్మించాలని కార్పొరేటరు కోరడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ కాలనీ 1, 2 సహా రామన్న కాలనీ, చిట్టిబాబు కాలనీ వాసులకు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామ అవసరాలు, పిల్లలకు ఆటలు, క్రీడా సాధన కోసం పార్కు ఉపయుక్తంగా ఉంటుందని కాలనీల నివాసితులు అభిప్రాయాన్ని బలంగా వినిపిస్తున్నారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.వి.ఎన్.మాధవ్... విష్ణుకుమార్ రాజు తమ అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్



సమావేశంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు సినిమా ఉత్సవం (ఫిల్మ్ ఫెస్టివల్) శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ భక్త ప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదలైన రోజు తెలుగు సినిమా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మై ఆటోగ్రఫీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హుస్సేన్, దాట్ల బాబూరావు, డాక్టర్ బాబ్జి, డాక్టర్ సుధాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వుడా స్థలం... పరాధీనం

చోద్యం చూస్తున్న యంత్రాంగం

మాధవధార, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాధవధార వుడాకాలనీలో వుడా స్థలాలకు రక్షణ లేకపోతోంది. కాలనీలో గ్యాస్ గోడౌన్ చివర కొండపక్క ఉన్న ఖాళీ స్థలానికి ఇటీవల ఉడా అధికారులు కంచె వేశారు. స్తంభాలు పాతి, చుట్టూ కంచె వేసి, కబ్జా నుంచి రక్షణ కల్పించారు. అయితే కొద్ది రోజులుగా ఇక్కడ అనధికార షెడ్డు కనిపిస్తోంది. కాలనీలో ప్రైవేటు వ్యక్తులు సిమెంట్ రేకుల షెడ్డుగా తయారు చేసి, తమ వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారు. బయట వ్యక్తులు లోనికి రాకుండా స్థలానికి చుట్టూరా 15 అడుగుల పొడవున రేకుల షెడ్డు నిర్మించారు. పైకప్పు లేకుండా తాత్కాలికంగా వారి అవసరాలు ఉన్నపుడు దీని మీదుగా షామియానా వేసి వినియోగిస్తున్నారు. ఇనుప పైపులతో పూర్తి శాశ్వత షెడ్డుగా మార్చేసి, గేటు అమర్చి తాళం వేసి తమ అధీనంలో ఉంచుకుని, కాలనీ అసోసియేషన్‌కు కూడా సమాచారం ఇవ్వకుండా పెత్తనం చెలాయిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కాలనీలో ఈ స్థలంతో పాటు కొన్ని నెలల క్రితమే వేలం పాట పూర్తి కాని స్థలాల్ని గుర్తించిన ఉడా అధికారులు అధికారికంగా సిమెంట్ స్తంభాలు వేసి, ఇనుప కంచె ఏర్పాటు చేశారు. దీనిపై ఉడా బోర్డులు అమర్చారు. అయితే, ఆక్రమణదారులు ఈ హెచ్చరికల్ని పక్కన పెట్టి తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపించారు.

అట్టహాసంగా గాదె శ్రీనివాసులునాయుడు నామినేషన్



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న గాదె శ్రీనివాసులనాయుడు తదితరులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసనమండలి స్థానానికి మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్ వరకు తరలివెళ్లి కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నిర్మూలనకు సహకరించాలి

అవగాహన ర్యాలీలో డీసీఎల్ సునీత



అక్కయ్యపాలెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కార్మికశాఖాధికారులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరి కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయం నుంచి ఎనభై అడుగుల రోడ్డు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఎం.రామారావు సూచనల మేరకు ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బాల కార్మికులు పని చేస్తున్న దుకాణాలపై దాడులు చేసి వారికి పని నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. పెందుర్తి, పద్మనాభంలలో కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారని, వీరందరికీ మద్ది గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బాల కార్మిక వ్యవస్థపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ దుకాణాల్లో పని చేస్తున్న పిల్లలకు కార్మికశాఖాధికారులు విముక్తి కలిగించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎల్ ఎం. రామారావు, సహాయ కమిషనర్లు గోవింద్, రాజు జేజేఎం సంస్థ ప్రతినిధి జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



లక్ష్మీగణపతి ఆలయ గోపుర పూజలో పాల్గొన్న భక్తులు

మురళీనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు మాధవధార ఉడాకాలనీలోని లక్ష్మీ గణపతి దేవాలయ 17వ వార్షికోత్సవం ఘనంగా చేపట్టారు. శుక్రవారం సుప్రభాత సేవలతో ఆరంభమైన వేడుకల అనంతరం అష్టోత్తర శత కలశ అభిషేకం జరిపారు. 108 కలశాలతో ఆవాహన, అర్చన, హారతి కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆలయ మహా గోపుర అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మాధవధార ఉడాకాలనీలోని మందిరం నుంచి కాలనీ వీధుల మీదుగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ నెల 5 నుంచి మూడు రోజులు నిర్వహించిన ఉత్సవాలు వైభవంగా ముగిశాయి.

ఉత్తరాంధ్రకిచ్చిన కీలక హామీలు నెరవేర్చాం

వైసీపీకి రెండోసారి చాన్సేలేదు: ఎంపీ శ్రీభరత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఉత్తరాంధ్ర ప్రజలకు గతంలో ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన వాటిని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని టీడీపీ ఎంపీ శ్రీభరత్ తెలిపారు. రైల్వే జోన్‌లో వాల్తేరు డివిజన్‌ను కొనసాగించడం, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవడానికి కేంద్రం నుంచి ఆర్థిక ప్యాకేజీని సాధించామని తెలిపారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను ఉత్తరాంధ్రలోనే నెలకొల్పుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం, ఇక్కడ టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. పోలవరాన్ని పూర్తిచేసి లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు సాగు, తాగు నీరు అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. విశాఖ భూములను పరిరక్షించేందుకు చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు అధికారంలోకి వచ్చే నాటికి 9శాతం కాగా, ఏడు నెలలలోనే 3.5 శాతం పెరిగి 12.5 శాతానికి చేరడం గమనార్హమన్నారు. ఒక్కచాన్స్ ఇవ్వాలని అధికారంలోకి వచ్చిన వైసీపీ దరిద్రాన్ని రాష్ట్రప్రజలు ఐదేళ్ల పాటు భరించారని, మళ్లీ రెండోసారి ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని అన్నారు.

కేకే లైనుతో కూడిన విశాఖ డివిజన్ ఉండాల్సిందే

సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న జగ్గునాయుడు, ఇతర నాయకులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌ను కాలగర్భంలో కలిపేందుకు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆరోపించారు. కేకే లైనుతో కూడిన విశాఖ డివిజన్ కావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ సాకారమైందని ఓవైపు ఆనందం కలిగినా, వాల్తేరు డివిజన్ ను విభజించి రాయగడ పేరుతో కొత్త డివిజన్ ప్రకటించడం కేంద్ర ప్రభుత్వ కుట్రకు నిదర్శనమని దుయ్యబట్టారు. కొత్తజోన్‌కు రావాల్సిన ఆదాయం ఒడిశా పరిధిలో రాయగడకు వెళ్లిపోతుందని, జోన్ అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా కేకే లైను వాల్తేరు పరిధిలో ఉండాల్సిందేనని డివిజన్ అధికారులు అభిప్రాయపడుతున్నారని అన్నారు. కేకే లైను లేకపోతే విశాఖ డివిజన్ ఆదాయానికి గండి పడి అభివృద్ధికి అవకాశం లేకుండాపోతుందని రైల్వే కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. అత్యధిక రాబడిని ఇచ్చే కేకే లైను లేకుండా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ స్వరూపాన్ని ఖరారు చేస్తూ కేంద్ర రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అరకు లోయ సహా కేకే లైనును రాయగడ డివిజన్‌లో చేర్చడంతో కొత్తగా ఏర్పడే విశాఖ రైల్వే డివిజన్ రాబడికి భారీగా గండిపడుతుందని నిరాశను వ్యక్తంచేశారు. ఎంతో చరిత్ర గలిగిన డివిజన్‌ను వదులుకునేందుకు సిద్ధంగా లేమని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న రైల్వే జోన్ పట్ల కేంద్రం మెలిక పెట్టడం, కూటమి ప్రభుత్వం సమర్థించడం ఎంతవరకు సబబని జగ్గునాయుడు నిలదీశారు. కేకేలైనుతో కూడిన విశాఖ డివిజన్ ఏర్పాటు చేయకపోతే ప్రజా సంఘాలు, రైల్వే కార్మికులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో కొనసాగించాలన్న డిమాండ్‌తో శనివారం రైల్వేస్టేషన్ వద్ద సీపీఎం ఆందోళన చేపడుతుందన్నారు. దీనిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వైద్య విద్యార్థులకు నూతన ఎయిర్ జిమ్



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.బుచ్చిరాజు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థుల ఫిట్‌నెస్ కోసం నూతన ఎయిర్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ప్రాంతంలో పురుషుల హాస్టల్ వద్ద నిర్మించిన ఈ వ్యాయామ శాలను శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. వైద్య విద్యార్థులలో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు క్రీడలు, శారీరక వ్యాయామం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎస్.పాత్రుడు, స్పోర్ట్సు కార్యదర్శి పి.సాయిచరణ్, డాక్టర్ ఎంవీఎస్ఎస్.బాపురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెడ్డ స్థలాల్లో ఇష్టారీతిన నిర్మాణాలు



ఉడాకాలనీ గెడ్డలో చేపడుతున్న నిర్మాణం

మాధవధార, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీ లేఅవుట్ గెడ్డ ప్రాంతాల్లో నిర్మాణాలకు స్థానిక అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఉడాకాలనీ నివాసితుల సంక్షేమ సంఘం నిర్వహణలో ఉన్న కమ్యూనిటీ హాలు పక్కనే గెడ్డను ఆనుకొని ఉన్న ఓ ఇంటి యజమాని వారికి నచ్చినట్లు కొత్తగా ప్రహరీ విస్తీర్ణం పెంచి, లేఅవుట్‌లో గెడ్డ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్నారు. ఇందుకోసం నేరుగా గెడ్డలో ఇంటి పునాది స్తంభాన్ని దించి నిర్మాణం చేపట్టారు. వీఎంఆర్‌డీఏ ఇటీవలే లేఅవుట్‌లో క్రాస్ బిట్‌లుగా గుర్తించిన ఖాళీ స్థలాల్ని ఆనుకొని ఈ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని నివాసిత సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు అశోకచక్రవర్తి తెలియజేశారు. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ఇష్టారీతిన చేపడుతున్నారని అన్నారు. ఎప్పుడో కట్టిన ఇంటికి ఇపుడు గెడ్డ ప్రాంతంలో గోడను తొలచి, వారికి అనుకూలంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. కాలనీవాసులకు వర్షాకాలంలో ఎలాంటి నీటి ముంపు సమస్య లేకుండా గెడ్డ ప్రాంతాల్ని సంరక్షించాలని ఆయన అధికారులను కోరారు.

హయగ్రీవకు ఈడీ షాక్

... 5వ పేజీ తరువాయి

కొద్దిరోజులు ఆగి పనుల నిలిపివేతపై ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న జి.వెంకటేశ్వరరావు కోర్టును ఆశ్రయించారు. పనులకు ఆటంకం కల్పించవద్దని కోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో ఏఏ పత్రాలు అవసరమో సూచిస్తూ జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అందులో కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ కూడా ఉండాలని పేర్కొన్నారు. దాంతో జి.వెంకటేశ్వరరావు మరోసారి ఆన్‌లైన్‌లో ప్లాన్ ప్రతిపాదనలు సమర్పించారు. జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ దానిని పరిశీలించి ఎటువంటి మధ్యంతర ఉత్తర్వులు అమలులో లేవని, అయితే రిట్ పిటిషన్ 160/2022, 191/2022 తీర్పులకు లోబడి పనులు చేసుకోవాలని సూచించింది.

సెల్ఫీ వీడియో కలకలం

ఇదిలావుండగా జగదీశ్వరుడు 2021 డిసెంబరు 19న ఒక సెల్ఫీ వీడియో రిలీజ్ చేశారు. జి.వెంకటేశ్వరరావు, మరికొంతమంది కలిసి తన భూమిని లాక్కున్నారని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, ప్రాణ హాని కూడా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తీవ్ర సంచలనం కలిగించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించి, భాగస్వాముల మధ్య విభేదాలు ఉన్నాయని బిల్డింగ్ ప్లాన్ అనుమతిని రద్దు చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆయన ప్రత్యేకంగా కోరారు. యాజమాన్య హక్కులపైనే వివాదం తలెత్తినందున అనుమతులన్నీ అబెయెన్స్‌లో పెట్టాలని, కోర్టు నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకోవాలని, అంతవరకు పనులు ఆపేయాలని సూచిస్తూ జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

ప్రభుత్వం మారాక పోలీసు కేసు

గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో జగదీశ్వరుడుకు కొంత ధైర్యం వచ్చింది. విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు, గద్దె బ్రహ్మాజీపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భార్యను బెదిరించి ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకోవడంతోపాటు తమ సంతకాలను ఫోర్జరీ చేసి తన భూమిని కబ్జా చేశారని 2024 జూన్ 22న ఫిర్యాదుచేశారు. తీవ్రమైన ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలో దిగింది. లోతుగా విచారణ చేసింది. అందులో భాగంగా ఎంవీవీ సత్యనారాయణ ఇళ్లలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకుంది. ఈ భూమిని ఎనిమిది మందికి అమ్మడానికి జగదీశ్వరుడు ప్రయత్నించాడని తేల్చింది. అలాగే ఎంవీవీ బిల్డర్స్, జి.వెంకటేశ్వరరావు, బ్రహ్మాజీలు కలిసి ఈ భూమి ద్వారా రూ.87.64 కోట్లు సంపాదించారని, ఆ మొత్తాన్ని స్వప్రయోజనాలకు వాడుకున్నారని తేల్చింది. అందుబాటులో ఉన్న వారి స్థిరచరాస్తులు రూ.44.75 కోట్ల విలువైనవి స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణం ఆగిపోయింది.

ప్రాక్టికల్ పరీక్షలకు పైసా వసూల్!

... 5వ పేజీ తరువాయి

వసూలు చేసినట్టు తెలిసింది.

అక్రమాలకు పాల్పడితే చర్యలు: ఆర్ఐఓ

పరీక్షల నేపథ్యంలో నగదు వసూళ్లపై ఆర్ఐవో మురళీధర్‌ను వివరణ కోరగా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలకు నియమించిన సిబ్బంది ఎలాంటి అక్రమాలకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.40 కోట్లతో పంచాయతీల అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ప్రణాళికలు రూపొందించారు. ప్రణాళికల్లో పేర్కొన్న పనులు చేపడితేనే బిల్లులు మంజూరవుతాయి. వాటిల్లో లేని పనులు చేస్తే బిల్లులు ఇవ్వరాదని కేంద్రం ఆదేశించిందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీలు ప్రతిపాదించిన పనుల వివరాలు పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. సాధారణంగా పారిశుధ్యం, తాగునీరు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, డ్రైన్లు, తదితర పనులకు నిధులు కేటాయిస్తుంటారు.

కోడి వ్యర్థాల సేకరణ టెండర్లలో గోల్‌మాల్

... 5వ పేజీ తరువాయి

సూచన మేరకు ఒక్కో ప్రజాప్రతినిధి సూచించిన వారికి ఒక్కో జోన్ చొప్పున ఎనిమిది జోన్లను సర్దుబాటు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు పిలిచిన అధికారులు అందరి సమక్షంలోనే టెక్నికల్ బిడ్‌ను, తర్వాత ఫైనాన్స్ బిడ్‌ను ఓపెన్ చేసి ఎవరు అర్హత సాధించారు, ఎవరు ఆమోదయోగ్యమైన ధరకు కోట్ చేశారనేది చూసి కాంట్రాక్టర్‌ను ఎంపికచేయాలి. కానీ ప్రజాప్రతినిధుల జోక్యంతో అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్‌ను పక్కనపెట్టేసి ప్రజా ప్రతినిధులు సూచించిన వారికి అనధికారికంగానే ఒక్కో జోన్ చొప్పున వర్క్ ఆర్డర్లు ఇచ్చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యర్థాలు సేకరించే వారంతా కాపులుప్పాడ యార్డుకు కాకుండా చేపల చెరువులకు తరలిస్తున్నాసరే తాము చోద్యం చూడాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు.

రాజమండ్రిలో మాదిరిగా చికెన్ వ్యర్థాలను పర్యావరణ హితంగా ప్రాసెస్ చేసి ఎరువుగా మార్చే యూనిట్‌ను కాపులుప్పాడలో ఏర్పాటు చేయాలని గత కమిషనర్ సంపత్‌కుమార్ భావించారు. అందుకోసం రాజమండ్రిలో యూనిట్‌ను ఏర్పాటుచేసిన సంస్థకు కాపులుప్పాడలోని యార్డులోని ఐదెకరాలు కేటాయించారు. ఆ సంస్థ జీవీఎంసీకి ఏటా రూ.1.5 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. ఆ దిశగా ఒప్పందం చేసుకుంటారనుకుంటున్న సమయంలో సంపత్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. దాంతో ఆ యూనిట్ ఏర్పాటు మరుగునపడినట్టేనని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

అంతర్జాతీయ అవార్డు ఆనందాన్నిచ్చింది

'హ్యాట్సాఫ్' ఫేం యాదవ్‌కుమార్



సిరిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):నటనపై ఆసక్తితో రాణిస్తున్నారు యాదవ్ కుమార్. ఈ క్రమంలో ఆయన దర్శకత్వం వహించిన 'లైఫ్' గుర్తింపు తె చ్చింది. సినిమాలకే పరిమితం కాకుండా లఘుచిత్రాలు ప్రారంభించారు.'హ్యాట్సాఫ్' లఘు చిత్రంలో ఆయన నటించిన పోలీసు పాత్రకు అంతర్జాతీయ అవార్డు రావడంతో నటనా ప్రతిభ వెలుగుచూసింది.

ప్రశ్న:దర్శకుడు, నటుడు ఏది బాగుంది?

సమాధానం: దర్శకుడిగా రాణించాలన్నదే నా కల. మూడు చిత్రాలకు దర్శకత్వం వహించాను. 'లైఫ్' పెద్ద హిట్‌గా నిలిచింది. విశాఖలో ఉండడంతో నగర కళాకారులకు అవకాశం కల్పిస్తుంటా. 'హ్యాట్సాఫ్' లఘు చిత్రం కథను దర్శకుడు జీవీ త్రినాథ్ చెప్పినప్పుడే పోలీస్‌పాత్రలో నటించాలనుకున్నా. నేషనల్ అవార్డు రావడంతో సంతృప్తి లభించింది.

ప్ర: ఈ అవార్డు వస్తుందనుకున్నారా?

స: అంతర్జాతీయ అవార్డు రావడం ఆనందానిచ్చింది. హ్యాట్సాఫ్‌లో పోలీస్ పాత్ర సమాజాన్ని మేల్కొపేలా ఉంటుంది. అవార్డు ఊహించలేదు.

ప్ర: భవిష్యత్తులో ఎలాంటి చిత్రాలు ఆశించవచ్చు?

స: లఘు చిత్రాలు తీస్తుంటా. ప్రస్తుతం కంచర్ల చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నా. నగర కళాకారులను ప్రోత్సహించేలా మంచి కథతో సినిమా తీస్తాను.

12న జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 12న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నామని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం సీఈవో జి.గోపీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనేవారు జనవరి ఒకటి, 2005న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు వయసు ధ్రువీకరణ పత్రంతో సహా సాయంత్రం 4 గంటలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియం హ్యాండ్‌బాల్ కోర్టులో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైనవారు ఈ నెల 21 నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు 9393996660 ఫోను నంబరులో సంప్రదించాలన్నారు.

సినిమా గైడ్

● **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),

● **భవానీ వార్డ్:** జగదాంబ, రమాదేవి

● **మదగజరాజా:** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),

● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 13, వంకాయలు(తెలుపు) 18,వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 42, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 100, అల్లం 42, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోసకాయలు 22, వె ల్లులి 170, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 38, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 38, కంద 56, దేముడుచిక్కుడు 32, గోరుచిక్కుడు 28, కూరపెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

పింఛన్లకు బదిలీ సౌకర్యం

» ప్రాంతాలు మారే లబ్ధిదారులకు మేలు

» ఎక్కడైనా పింఛన్ తీసుకునే అవకాశం



పింఛన్ తీసుకుంటున్న వృద్ధురాలు (ఫైల్ ఫొటో)

మద్దిలపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు మ్యాపింగ్ నమోదైన సచివాలయ పరిధిలోనే పింఛన్ అందుకోవాలి. దీనివల్ల ప్రతి నెలా ఒకటో తారీఖున లబ్ధిదారులు మ్యాపింగ్ చేసిన ఇంటికి ఉరుకులు, పరుగులు పెడుతుంటారు. అయితే ఈ సమస్యకు చెక్ చెప్పేలా ప్రభుత్వం కల్పించిన బదిలీ సౌకర్యంతో ఇలాంటి వారందరికీ మేలు కలుగనుంది. జీవీఎంసీ జోన్-3 పరిధిలో 15,099 పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరు ఉంటున్న ఇంటి చిరునామాతో పింఛన్లు మంజూరయ్యాయి. వీరిలో చాలా మంది ఇతర ప్రాంతాలకు చెందినవారున్నారు. ఇక్కడ ఎక్కువగా అద్దె ఇళ్లల్లో నివాసం ఉన్న వారు కావడంతో తరచూ ఇల్లు మారుతుంటారు. కానీ పింఛన్ సమయానికి పాత ఇంటికే వచ్చి నగదు పొందాల్సి వుంటుంది. వీరే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వాసులు కూడా ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి జోన్-3 పరిధిలో జీవనం సాగిస్తున్నారు. వారి ఇళ్లల్లో వృద్ధులు, వికలాంగులకు ఇక్కడి చిరునామాల ప్రకారం పింఛన్లు పొందుతున్నారు. కొంతమంది సొంతూళ్లకు వెళ్లిపోయినా ప్రతి నెలా ఒకటో తేదీన ఇక్కడకు రావాల్సివుంటుంది. అంతేకాకుండా జోన్-3 పరిధి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు నెలా నెలా వృద్ధులను తీసుకుని రావడానికి ప్రయాసపడుతున్నారు. దీనికితోడు రవాణా చార్జీలకు అధికమొత్తంలో చేతిచమురు వదులుతోంది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతంలో నివాసముంటున్న వారు పింఛన్ బదిలీ చేయించుకుని అక్కడే నగదు తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

సచివాలయంలో బదిలీ ప్రక్రియ..

సచివాలయాల్లో ఎన్టీఆర్ పింఛన్ బదిలీ చేసుకోవచ్చు. ప్రతి నెలా 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పింఛన్ల వెబ్‌సైట్‌లో బదిలీ ఆప్షన్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఎక్కడకు బదిలీ చేయాలో అక్కడ చిరునామా ఇవ్వాలి. నివాసం ఉంటున్న జిల్లా, మండలం, సచివాలయం కోడ్ నమోదు చేయాలి. దీంతో బదిలీ చేసుకున్న సచివాలయానికి లబ్ధిదారుని రిక్వెస్ట్ వెళ్తుంది. అక్కడ కార్యదర్శి యాక్సెప్ట్ చేసి మరుసటి నెల నుంచి పింఛన్ పంపిణీ చేస్తారు.

ఇతర ప్రాంతాల వారికి మేలు

పింఛన్ బదిలీతో ఇతర ప్రాంతాల లబ్ధిదారులకు మేలు కలుగుతుంది. ప్రతి నెలా పాత చిరునామాకు రావడానికి చార్జీలు వెచ్చించి ప్రయాసపడే బాధ తప్పుతుంది. బదిలీ దరఖాస్తు చేసుకుంటే వారున్న ప్రాంతంలోనే పింఛన్ పొందవచ్చు. ఈ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలి.

- లంకాడ రాము, ఏపీడీ, జీవీఎంసీ జోన్-3

ఎంవీవీ పీక్ నిర్మాణాలు నిలిపివేయాలి

» జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



మాట్లాడుతున్న కార్పొరేటర్ మూర్తియాదవ్

సిరిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలోని ఎంవీవీ పీక్ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు శుక్రవారం మేఘలయా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సీబీసీఎన్‌సీ ఆస్తులను అన్యాయంగా లాక్కున్నారని ఆరోపించారు. దీనికి దొడ్డిదారిన టీడీఆర్ తీసుకున్నారని, 15, 826 చదరపు అడుగుల విస్తీరంలో బహుళ అంతస్తుల భవనం నిర్మించాలని హెచ్‌ఆర్‌ఆర్ అనే సంస్థ పేరుతో ప్లాన్ పెట్టారన్నారు. ప్లాన్‌కు ఆమోదం రాకుండానే నిర్మాణ పనులను చేపడుతున్నారని విమర్శించారు. ఎంవీవీ పీక్ పేరిట జరుగుతున్న నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదని, దొంగ దస్తావేజులు సృష్టించి 1.93 సెంట్లు రూ.129 కోట్ల టీడీఆర్ కొట్టేశారని ఆరోపించారు. కాకినాడలో సుమారు రూ.129 కోట్లు, విశాఖలో రూ.64 కోట్లు కొట్టేసి దీనిని నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.200 కోట్ల జీవీఎంసీ ఆదాయం స్వాహా చేశారన్నారు. దీనిపై ఈడీ విచారణ చేయాలని కోరారు. సీబీసీఎన్‌సీ భూముల్లో అక్రమాలపై న్యాయం పోరాటం కూడా చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటినా కొందరు అధికారులు వైసీపీ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శించారు.

శ్మశానంలో పనిచేయని బోరు



ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 18 వార్డు పరిధిలోని వెంకోజీపాలెం శ్మశానవాటికలో నీటి ఎద్దడి నెలకొంది. వెంకోజీపాలెం, ఇసుకతోట, అటు హనుమంతువాక, క్రాంతినగర్, సంజయ్‌గాంధీకాలనీ, రామాలయం వీధి తదితర ప్రాంతాలకు ప్రధాన శ్మశానవాటిక ఇది. ఇక్కడ నీటి అవసరం చాలా ఉంది. వాటిలోనున్న బోరు మరమ్మతుపాలవడంతో కొద్ది రోజులుగా అంత్యక్రియలకు వచ్చే వారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మరో ప్రత్యామ్నాయం లేక హనుమంతువాక లేదా వెంకోజీపాలెం వరకూ వెళ్లి 20 లీటర్ల ట్యాంక్ నీటిని కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తక్షణం బోరును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్గానిక్ కాంపౌండ్స్ శుద్ధీకరణపై జాతీయ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో 'ఆధునిక సాంకేతికతలో ఆర్గానిక్ కాంపౌండ్స్ శుద్ధీకరణ, లక్షణాల గణన' అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ను శుక్రవారం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్.రాజు ప్రారంభించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు బి.ఉదయ్‌కుమార్ ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఔషధాలుగా ఆర్గానిక్ కాంపౌండ్స్, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజు వివిధ రంగాల్లో రసాయనశాస్త్రం ప్రాధాన్యత తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు కన్వీనర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ వి.సిద్ధయ్య ఆర్గానిక్ కాంపౌండ్స్ శుద్ధి చేయాల్సిన అవసరం, ఫలితాలపై వీటి ప్రభావాన్ని పేర్కొన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో ఎస్‌విడా బయోసైన్సెస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి.సుబ్బరాజు ఆర్గానిక్ కాంపౌండ్ శుద్ధీకరణ, లక్షణాల గణన సాంకేతికతలపై ఉపన్యాసం ఇచ్చారు. ప్రొఫెసర్లు శివరావు, శైలజ, బసవయ్య, డాక్టర్ వి.క్రిస్టోఫర్, డాక్టర్ కమల తదితరులు పాల్గొన్నారు.

25 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

సీతంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని, ఆటో సహా పట్టుకున్నట్లు నాలుగో పట్టణ పోలీసులు చెప్పారు. జ్ఞానాపురం రాసా వీధికి చెందిన తనవరపు రమణ (46) పలువురి వద్ద రేషన్ బియ్యం కిలో రూ.11, రూ.12లకు కొనుగోలు చేసి నల్లబజారులో అమ్ముతుంటాడు. ఈ క్రమంలో 25 బస్తాల బియ్యాన్ని శుక్రవారం తెల్లవారు జామున ఆటోలో తరలిస్తుండగా, రాత్రి విధులు నిర్వహిస్తున్న నాలుగో పట్టణ ఎస్‌ఐ కె.సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి బియ్యాన్ని పట్టుకొని పోలీసు స్టేషన్‌కి తరలించారు. సీఐ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమంగా తరలిస్తున్న 1,194 కిలోల బియ్యంతో పాటు తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు.

కొండవాలు ప్రాంతంలో దుకాణాలను తొలగించాల్సిందే

» యజమానులను ఆదేశించిన ఉక్కు సిబ్బంది



దుకాణదారులను హెచ్చరిస్తున్న స్టీల్ సిబ్బంది



రహదారికి అడ్డుగా ఉన్న ఆటోను తొలగిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో స్టీల్‌ప్లాంటు స్థలాలకు ఆనుకుని రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలని యజమానులను ఉక్కు కర్మాగార సిబ్బంది ఆదేశించారు. శుక్రవారం ఈ ప్రాంతాలలో పర్యటించి వ్యాపారులతో మాట్లాడారు. స్వచ్ఛందంగా ముందుకురాకుంటే బడ్డీలను తామే తొలగిస్తామన్నారు. అలాగే సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో మూతపడిన పంప్‌హౌస్ ప్రాంతంలో బడ్డీల వెనుక అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, వెంటనే వాటికి స్వస్తి పలకకుంటే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్‌బీకాలనీ రోడ్డులోని స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై పండ్లు విక్రయిస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్న ఆటోను తొలగించారు. స్టీల్‌ప్లాంట్ స్థలాలను ఆక్రమిస్తే ఇకపై సహించేదిలేదని ఎస్టేట్ అధికారి జగన్నాథరావు హెచ్చరించారు.

కళాభారతిలో అలరించిన నాటికలు



మేమూ మనుషులమే నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నాటక ప్రదర్శనలు అలరించాయి. జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ కళాకారులు ప్రదర్శించిన మేము మనుషులమే నాటిక ఆకట్టుకుంది. ట్రాన్స్‌జెండర్స్ కూడా మనుషులుగా గుర్తించి వారికి సమాజంలో స్థానం కల్పించాలనే సందేశం ఇచ్చారు. మరో నాటిక చిటారు కొమ్మన మిఠాయి పొట్లాం హాస్యభరితంగా సాగింది. కళాకారులు డైలాగ్స్‌కు ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వారు. ముందుగా నాటక ప్రదర్శనలను అకాడమీ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి రాంబాబు, సన్యాసిరావు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు వద్ద జోరుగా ఉత్పత్తుల విక్రయాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రకారాగారం ప్రధాన గేట్ వద్ద ఏర్పాటు చేసిన సుధార్ కేంద్రం వద్ద వివిధ రకాల ఉత్పత్తుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కూరగాయలతోపాటుపిండివంటలు, దుప్పట్లు, టవల్స్, బెడ్ షీట్లు, ఫినాయిల్, ఆవుపేడతో చేసిన పిడకలను అమ్ముతున్నారు. అన్ని కేంద్రకారాగారాల్లో ఖైదీలు తయారుచేసిన ఉత్పత్తులను బహిరంగ మార్కెట్‌కన్నా తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. కౌంటర్లలో ఇద్దరు ఓపెన్ ఖైదీలు ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటలవరకు విక్రయిస్తున్నారు. ఈ ఆదాయాన్ని జైలు సంక్షేమ నిధికి జమ చేస్తామని జైలు సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు.

ముడసర్లోవ పార్కుకు ప్రహరీ నిర్మించేదెన్నడో?



ముడసర్లోవ పార్కు ప్రహరీ గోడకు కట్టిన కర్రలు

ఆరిలోవ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సిద్ధమైన ముడసర్లోవ పార్కులో హుదూద్ సమయంలో కూలిపోయిన ప్రహరీని నేటి వరకు పునర్నించకపోవడంపై సందర్శకులనుంచి విమర్శలు తలెత్తుతున్నాయి. ముడసర్లోవ రిజర్వాయర్ చుట్టూ మూడేళ్ల కిందట కోట్లాది రూపాయల జీవీఎంసీ నిధులతో ప్రహరీ కట్టారు. కానీ, ఈ పార్కులో పదేళ్ల కిందట కూలిన ప్రహరీని ఇంతవరకు పట్టించుకోలేదు. ఈ పార్కుని ఏటా లక్షలాది రూపాయలకు సంబంధిత కాంట్రాక్టర్‌కు లీజుకు ఇస్తుంటారు. దీని వల్ల ఆదాయం వస్తున్నా జీవీఎంసీ అధికారులు ప్రహరీ నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో విమర్శలు తలెత్తున్నాయి. ఈ పార్కుని సందర్శించడానికి నిత్యం నగర వాసులతో ఇతర ప్రాంతాలనుంచి పర్యాటకులు వస్తుంటారు. కానీ అభివృద్ధిపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. గత వైసీపీ పాలకులు ఈ పార్కుని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పలుమార్లు అధికారులు వచ్చి పరిశీలించారు. కానీ, అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు. కనీసం కూలిన గోడలనైనా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

క్రీడలతో ఉద్యోగులకు ఉపశమనం: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వెలగపూడిని సత్కరిస్తున్న ఉద్యోగులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఒత్తిడి ఎదుర్కొనే ఉద్యోగులకు శారీరక, మానసిక ఉల్లాసానికి ఆటవిడుపు ఉండాలని తఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఈపీడీసీఎల్ పరిధిలోని 15వ వార్డు హెచ్‌బీ కాలనీ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్‌శాఖ ఉద్యోగుల యూనియన్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి ఆటగాళ్లను అభినందించారు. ఉద్యోగంలో ఒత్తిడికి లోనయ్యే ఉద్యోగులకు ఆటలు ఊరటగా ఉంటుందన్నారు. పోటీల్లో 20 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉద్యోగులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, ఈపీడీసీఎల్ ఎస్‌ఈ శ్యాంబాబు, సీతమ్మధార ఏడీఈ జ్యోతి, గణపతి, గురునాథరావు, చిరంజీవి, నూకరాజు, శ్రీనివాసరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన ముఖ్య కార్యదర్శి



వివరాలు తెలుసుకుంటున్న సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఎంవీపీ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ కేంద్రంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న డీఎస్సీ కోచింగ్ తీరుతెన్నులపై ప్రశ్నించారు. నాణ్యమైన బోధన, మెరుగైన ఫలితాల కోసం కృషిచేయాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ, బీసీ కార్పొరేషన్లలో సిబ్బంది తమ సమస్యల సాధనకు వినతి పత్రాలను అందించారు. ఈ కార్య క్రమంలో బీసీ సంక్షేమ, సాధికారిక అధికారిణి శ్రీదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



తోటగరువు ఉపాధ్యాయులతో విజయగౌరి

ఆరిలోవ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తానని శాసన మండలి పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి అన్నారు. ఆరిలోవ, తోటగరువు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఆమె ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు నిధుల కోత విధిస్తోందన్నారు. పాఠశాల విద్యను అంగడి సరుకుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీతో ఉపాధ్యాయులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, పిల్లలు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో పని భారం, ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఈ సమస్యలపై మండలిలో గళమెత్తుతానన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్, ప్రజాసంఘాల నాయకులు నరేంద్రకుమార్, శంకర్, నాగరాజు, రంగమ్మ, రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో సీసీ కెమెరాలతో నిఘా

» వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్

సిరిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ పార్కుల్లో రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. శుక్రవారం వీఎంఆర్డీఏ హాల్‌లో రెవెన్యూ, పరిపాలనా అలాట్‌మెంట్, సాంకేతిక, ప్రణాళిక విభాగాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి ఇంజనీరింగ్ పనుల అంచనాలను సమగ్రంగా రూపొందించాలని ఆదేశించారు. భూ వినియోగ మార్పిడి దరఖాస్తులను, సిబ్బంది వ్యక్తిగత లాగిన్‌లో ఉన్న దస్త్రాలను క్లియర్ చేయాలని సూచించారు. ఈసమావేశంలో కార్యదర్శి మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ శంకర్, చీఫ్ ప్లానర్ శిల్పా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికీ కూటమి మద్దతులేదు

» మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్



గాదె శ్రీనువాసులనాయుడుకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఇతర ప్రతినిధులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏ సంఘానికీ మద్దతు ప్రకటించలేదని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ స్పష్టంచేశారు. బీజేపీకి అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మాత్రమే గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతు తెలిపిందన్నారు. శుక్రవారం గాదె నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రాజమండ్రికి 178 మంది ఖైదీల తరలింపు

ఆరిలోవ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రకారాగారం నుంచి రాజమండ్రి కేంద్ర కారాగారానికి ఇప్పటివరకు 178 మంది శిక్ష పడిన ఖైదీలను తరలించినట్టు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. శిక్ష ఖరారైన 200 మందిలో 178 మందిని మాత్రమే పంపిస్తామన్నారు. పలు సాంకేతిక కారణాలతో 22 మందిని రాజమండ్రి తరలించడంలేదన్నారు. రెండవ విడతలో మంచి నడవడిక గల మరికొంత మంది ఎంపుతామని తెలిపారు. వారిని కమిటీ ద్వారా ఎంపిక చేస్తున్నట్టు వివరించారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



వెంకటేశ్వరస్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ ఆరో సెక్టారులోని శ్రీ వెంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. చతుస్థానార్చన, నిత్య పూర్ణాహుతి, స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, పట్టువస్త్రాల సమర్పణ, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 తేదీ వరకూ నిర్వహించనున్నారు. శనివారం తులసీ దళార్చన, పండిత సదస్యం, ఆదివారం కుంభప్రోక్షణం, ఈ నెల 12న శ్రీఉమారాలింగేశ్వరస్వామివారి 41వ ప్రతిష్ఠా వార్షిక కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహనకు 16న పింక్ సఖీ శారీవాక్

మహారాణిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. రోహిత్ మెమోరియల్ ట్రస్టు రౌండ్‌టేబుల్ లేడీస్ సర్కిల్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16న విశాఖలోని బీచ్‌రోడ్డులో నిర్వహించనున్న పింక్ సఖి శారీవాక్ కార్యక్రమం పోస్టర్‌ను మేయర్ ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శారీవాక్ కార్యక్రమం జరుగుతుందని, ఔత్సాహికులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ సమావేశంలో గురుద్వార్ సత్సంగ్ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్.ఆనంద్, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ మీనాక్షి అనంత్‌రామ్, పర్వానా బేగం, గుర్మిత్ కోహ్లి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర జిల్లా నోడల్ అధికారిగా డా.కె.వి.రమణ

కంచరపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర జిల్లా నోడల్ అధికారిగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ నియమితులయ్యారు.



జిల్లాలోని నాలుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 11 ప్రైవేటు కళాశాలల్లో ప్రతి మూడో శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను ఆయన పరిశీలిస్తారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన బాధ్యతను సమర్థంగా నెరవేరుస్తానన్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేస్తానన్నారు. డా.కె.వి.రమణను పలువురు అభినందించారు.

నాందీ ఫౌండేషన్ ఉదారత



అందుకున్న పుస్తకాల సంచులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది

కంచరపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కప్పరాడ ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సంచులు, రాత పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులు సుమారు 50 మందికి ప్రధానోపాధ్యాయిని విజయమాలిని వీటిని అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తీర్ణత కావాలని ఆకాంక్షించారు. నాంది ఫౌండేషన్ ప్రోత్సాహాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్‌పి ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలి సెమిస్టర్ ఫలితాలు విడుదల

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన తొలి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల శుక్రవారం విడుదల చేశారు. 76.34 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. అధ్యాపకులు ఉత్తీర్ణత వంద శాతానికి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు.

'నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు హర్షణీయం'



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు నామిటేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేయడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోసూరు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు ఈ నిర్ణయం ఉపకరిస్తుందన్నారు. బీసీలకు రక్షణ చట్టం అమలు, స్థానిక సంస్థల్లోని 34 శాతం రిజర్వేషన్లపైనా త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితలకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేణికి పదోన్నతి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు అధికారిగా ప్రస్తుతం సేవలందిస్తున్న పి.ఎం.సత్యవేణి జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు.

మార్చి 2న తోడు-నీడ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పునర్వివాహం, వితంతు వివాహం కొరుకునే వారికి వచ్చే నెల 2న ఉచితంగా తోడు నీడ కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీప ఏవీ రమణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదారి వెంకటరమణ తెలిపారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో ఆ రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు వాట్సాప్ నెంబరు 72073 74717ను లేదా కృష్ణా గార్డెన్స్‌లోని కార్యాలయంలోని సంప్రదించాలని కోరారు.

ప్రజాధనం దుర్వినియోగం తగునా?



మాధవధార అంబేడ్కర్ కాలనీలో ఆరంభమైన నిర్మాణ పనులు

మాధవధార, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలో కొన్నిచోట్ల నిర్మించిన భవనాలను సద్వినియోగం చేసుకోకుండా, పక్కనే మరొకటి నిర్మిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో 2024 ఎన్నికల ముందు కమ్యూనిటీ హాలు మంజూరైంది. ఇపుడు అదే చోట సచివాలయ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇదే చోట కాలనీ దారి పొడుగునా గతేడాది కట్టిన కళావేదిక ఇపుడు నిరుపయోగంగా మిగిలింది. ఆ భవనం పక్కనే ఇపుడు కొత్త నిర్మాణం కోసం పునాదులు తీస్తున్నారు. మంజూరైన కమ్యూనిటీ హాలు ఇప్పటికే ఉన్నందున, కాలనీవాసుల ఆహ్లాదం కోసం ఉద్యానవనం, జిమ్ పరికరాలతో సిద్ధం చేయాలని స్థానికులు కోరుతున్నారు. కమ్యూనిటీ హాలులో నడుస్తున్న 287వ సచివాలయాన్ని అదే భవనంలో కొనసాగించి, కాలనీవాసులకు పార్కు అభివృద్ధి చేయాలని సూచిస్తున్నారు. కాలనీవాసుల విన్నపాల్ని పట్టించుకోకుండా భవనం పక్కనే, మరో భవనం నిర్మించాలని కార్పొరేటరు కోరడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ కాలనీ 1, 2 సహా రామన్న కాలనీ, చిట్టిబాబు కాలనీ వాసులకు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామ అవసరాలు, పిల్లలకు ఆటలు, క్రీడా సాధన కోసం పార్కు ఉపయుక్తంగా ఉంటుందని కాలనీల నివాసితులు అభిప్రాయాన్ని బలంగా వినిపిస్తున్నారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.వి.ఎన్.మాధవ్... విష్ణుకుమార్ రాజు తమ అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్



సమావేశంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు సినిమా ఉత్సవం (ఫిల్మ్ ఫెస్టివల్) శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ భక్త ప్రహ్లద 1932 ఫిబ్రవరి 6న విడుదలైన రోజు తెలుగు సినిమా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా షై ఆటోగ్రఫీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హాస్సెన్, దాట్ల బాబూరావు, డాక్టర్ బాబ్జి, డాక్టర్ సుధాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వుడా స్థలం... పరాధీనం

చోద్యం చూస్తున్న యంత్రాంగం

మాధవధార, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాధవధార వుడాకాలనీలో వుడా స్థలాలకు రక్షణ లేకపోతోంది. కాలనీలో గ్యాస్ గోడౌన్ చివర కొండపక్క ఉన్న ఖాళీ స్థలానికి ఇటీవల ఉడా అధికారులు కంచె వేశారు. స్తంభాలు పాతి, చుట్టూ కంచె వేసి, కబ్జా నుంచి రక్షణ కల్పించారు. అయితే కొద్ది రోజులుగా ఇక్కడ అనధికార షెడ్డు కనిపిస్తోంది. కాలనీలో ప్రైవేటు వ్యక్తులు సిమెంట్ రేకుల షెడ్డుగా తయారు చేసి, తమ వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారు. బయట వ్యక్తులు లోనికి రాకుండా స్థలానికి చుట్టూరా 15 అడుగుల పొడవున రేకుల షెడ్డు నిర్మించారు. పైకప్పు లేకుండా తాత్కాలికంగా వారి అవసరాలు ఉన్నపుడు దీని మీదుగా షామియానా వేసి వినియోగిస్తున్నారు. ఇనుప పైపులతో పూర్తి శాశ్వత షెడ్డుగా మార్చేసి, గేటు అమర్చి తాళం వేసి తమ అధీనంలో ఉంచుకుని, కాలనీ అసోసియేషన్‌కు కూడా సమాచారం ఇవ్వకుండా పెత్తనం చలాయిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కాలనీలో ఈ స్థలంతో పాటు కొన్ని నెలల క్రితమే వేలం పాట పూర్తి కాని స్థలాల్ని గుర్తించిన ఉడా అధికారులు అధికారికంగా సిమెంట్ స్తంభాలు వేసి, ఇనుప కంచె ఏర్పాటు చేశారు. దీనిపై ఉడా బోర్డులు అమర్చారు. అయితే, ఆక్రమణదారులు ఈ హెచ్చరికల్ని పక్కన పెట్టి తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపించారు.

అట్టహాసంగా గాదె శ్రీనివాసులునాయుడు నామినేషన్



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న గాదె శ్రీనివాసులనాయుడు తదితరులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసనమండలి స్థానానికి మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్ వరకు తరలివెళ్లి కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నిర్మూలనకు సహకరించాలి

అవగాహన ర్యాలీలో డీసీఎల్ సునీత



అక్కయ్యపాలెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కార్మికశాఖాధికారులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరి కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయం నుంచి ఎనభై అడుగుల రోడ్డు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఎం.రామారావు సూచనల మేరకు ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బాల కార్మికులు పని చేస్తున్న దుకాణాలపై దాడులు చేసి వారికి పని నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. పెందుర్తి, పద్మనాభంలలో కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారని, వీరందరికీ మద్ది గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బాల కార్మిక వ్యవస్థపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ దుకాణాల్లో పని చేస్తున్న పిల్లలకు కార్మికశాఖాధికారులు విముక్తి కలిగించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎల్ ఎం. రామారావు, సహాయ కమిషనర్లు గోవింద్, రాజు జేజేఎం సంస్థ ప్రతినిధి జేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



లక్ష్మీగణపతి ఆలయ గోపుర పూజలో పాల్గొన్న భక్తులు

మురళీనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు మాధవధార ఉడాకాలనీలోని లక్ష్మీ గణపతి దేవాలయ 17వ వార్షికోత్సవం ఘనంగా చేపట్టారు. శుక్రవారం సుప్రభాత సేవలతో ఆరంభమైన వేడుకల అనంతరం అష్టోత్తర శత కలశ అభిషేకం జరిపారు. 108 కలశాలతో ఆవాహన, అర్చన, హారతి కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆలయ మహా గోపుర అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మాధవధార ఉడాకాలనీలోని మందిరం నుంచి కాలనీ వీధుల మీదుగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ నెల 5 నుంచి మూడు రోజులు నిర్వహించిన ఉత్సవాలు వైభవంగా ముగిశాయి.

ఉత్తరాంధ్రకిచ్చిన కీలక హామీలు నెరవేర్చాం

వైసీపీకి రెండోసారి చాన్సేలేదు: ఎంపీ శ్రీభరత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఉత్తరాంధ్ర ప్రజలకు గతంలో ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన వాటిని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని టీడీపీ ఎంపీ శ్రీభరత్ తెలిపారు. రైల్వే జోన్‌లో వాల్తేరు డివిజన్‌ను కొనసాగించడం, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవడానికి కేంద్రం నుంచి ఆర్థిక ప్యాకేజీని సాధించామని తెలిపారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను ఉత్తరాంధ్రలోనే నెలకొల్పుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం, ఇక్కడ టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. పోలవరాన్ని పూర్తిచేసి లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు సాగు, తాగు నీరు అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. విశాఖ భూములను పరిరక్షించేందుకు చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు అధికారంలోకి వచ్చే నాటికి 9శాతం కాగా, ఏడు నెలలలోనే 3.5 శాతం పెరిగి 12.5 శాతానికి చేరడం గమనార్హమన్నారు. ఒక్కచాన్స్ ఇవ్వాలని అధికారంలోకి వచ్చిన వైసీపీ దరిద్రాన్ని రాష్ట్రప్రజలు ఐదేళ్ల పాటు భరించారని, మళ్లీ రెండోసారి ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని అన్నారు.

కేకే లైనుతో కూడిన విశాఖ డివిజన్ ఉండాల్సిందే

సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న జగ్గునాయుడు, ఇతర నాయకులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌ను కాలగర్భంలో కలిపేందుకు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆరోపించారు. కేకే లైనుతో కూడిన విశాఖ డివిజన్ కావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడూతూ విశాఖ రైల్వే జోన్ సాకారమైందని ఓవైపు ఆనందం కలిగినా, వాల్తేరు డివిజన్ ను విభజించి రాయగడ పేరుతో కొత్త డివిజన్ ప్రకటించడం కేంద్ర ప్రభుత్వ కుట్రకు నిదర్శనమని దుయ్యబట్టారు. కొత్తజోన్‌కు రావాల్సిన ఆదాయం ఒడిశా పరిధిలో రాయగడకు వెళ్లిపోతుందని, జోన్ అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా కేకే లైను వాల్తేరు పరిధిలో ఉండాల్సిందేనని డివిజన్ అధికారులు అభిప్రాయపడుతున్నారని అన్నారు. కేకే లైను లేకపోతే విశాఖ డివిజన్ ఆదాయానికి గండిపడి అభివృద్ధికి అవకాశం లేకుండాపోతుందని రైల్వే కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. అత్యధిక రాబడిని ఇచ్చే కేకే లైను లేకుండా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ స్వరూపాన్ని ఖరారు చేస్తూ కేంద్ర రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అరకు లోయ సహా కేకే లైనును రాయగడ డివిజన్‌లో చేర్చడంతో కొత్తగా ఏర్పడే విశాఖ రైల్వే డిజిజన్ రాబడికి భారీగా గండిపడుతుందని నిరాశను వ్యక్తంచేశారు. ఎంతో చరిత్ర గలిగిన డివిజన్‌ను వదులుకునేందుకు సిద్ధంగా లేమని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న రైల్వే జోన్ పట్ల కేంద్రం మెలిక పెట్టడం, కూటమి ప్రభుత్వం సమర్థించడం ఎంతవరకు సబబని జగ్గునాయుడు నిలదీశారు. కేకేలైనుతో కూడిన విశాఖ డివిజన్ ఏర్పాటు చేయకపోతే ప్రజా సంఘాలు, రైల్వే కార్మికులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో కొనసాగించాలన్న డిమాండ్‌తో శనివారం రైల్వేస్టేషన్ వద్ద సీపీఎం ఆందోళన చేపడుతుందన్నారు. దీనిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వైద్య విద్యార్థులకు నూతన ఎయిర్ జిమ్



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.బుచ్చిరాజు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థుల ఫిట్‌నెస్ కోసం నూతన ఎయిర్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ప్రాంతంలో పురుషుల హాస్టల్ వద్ద నిర్మించిన ఈ వ్యాయామ శాలను శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. వైద్య విద్యార్థులలో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు క్రీడలు, శారీరక వ్యాయామం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్‌ఎన్.పాత్రుడు, స్పోర్ట్సు కార్యదర్శి పి.సాయిచరణ్, డాక్టర్ ఎంవీఎస్‌ఎస్.బాపురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెడ్డ స్థలాల్లో ఇష్టారీతిన నిర్మాణాలు



ఉడాకాలనీ గెడ్డలో చేపడుతున్న నిర్మాణం

మాధవధార, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీ లేఅవుట్ గెడ్డ ప్రాంతాల్లో నిర్మాణాలకు స్థానిక అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఉడాకాలనీ నివాసితుల సంక్షేమ సంఘం నిర్వహణలో ఉన్న కమ్యూనిటీ హాలు పక్కనే గెడ్డను ఆనుకొని ఉన్న ఓ ఇంటి యజమాని వారికి నచ్చినట్లు కొత్తగా ప్రహరీ విస్తీర్ణం పెంచి, లేఅవుట్‌లో గెడ్డ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్నారు. ఇందుకోసం నేరుగా గెడ్డలో ఇంటి పునాది స్తంభాన్ని దించి నిర్మాణం చేపట్టారు. వీఎంఆర్డీఏ ఇటీవలే లేఅవుట్‌లో క్రాస్ బిట్‌లుగా గుర్తించిన ఖాళీ స్థలాల్ని ఆనుకొని ఈ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని నివాసిత సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు అశోకచక్రవర్తి తెలియజేశారు. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ఇష్టారీతిన చేపడుతున్నారని అన్నారు. ఎప్పుడో కట్టిన ఇంటికి ఇపుడు గెడ్డ ప్రాంతంలో గోడను తొలచి, వారికి అనుకూలంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. కాలనీవాసులకు వర్షాకాలంలో ఎలాంటి నీటి ముంపు సమస్య లేకుండా గెడ్డ ప్రాంతాల్ని సంరక్షించాలని ఆయన అధికారులను కోరారు.

హయగ్రీవకు ఈడీ షాక్

... 5వ పేజీ తరువాయి

కొద్దిరోజులు ఆగి పనుల నిలిపివేతపై ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న జి.వెంకటేశ్వరరావు కోర్టును ఆశ్రయించారు. పనులకు ఆటంకం కల్పించవద్దని కోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో ఏఏ పత్రాలు అవసరమో సూచిస్తూ జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అందులో కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ కూడా ఉండాలని పేర్కొన్నారు. దాంతో జి.వెంకటేశ్వరరావు మరోసారి ఆన్‌లైన్‌లో ప్లాన్ ప్రతిపాదనలు సమర్పించారు. జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ దానిని పరిశీలించి ఎటువంటి మధ్యంతర ఉత్తర్వులు అమలులో లేవని, అయితే రిట్ పిటిషన్ 160/2022, 191/2022 తీర్పులకు లోబడి పనులు చేసుకోవాలని సూచించింది.

సెల్ఫీ వీడియో కలకలం

ఇదిలావుండగా జగదీశ్వరుడు 2021 డిసెంబరు 19న ఒక సెల్ఫీ వీడియో రిలీజ్ చేశారు. జి.వెంకటేశ్వరరావు, మరికొంతమంది కలిసి తన భూమిని లాక్కున్నారని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, ప్రాణ హాని కూడా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తీవ్ర సంచలనం కలిగించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించి, భాగస్వాముల మధ్య విభేదాలు ఉన్నాయని బిల్డింగ్ ప్లాన్ అనుమతిని రద్దు చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆయన ప్రత్యేకంగా కోరారు. యాజమాన్య హక్కులపైనే వివాదం తలెత్తినందున అనుమతులన్నీ అబెయెన్స్‌లో పెట్టాలని, కోర్టు నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకోవాలని, అంతవరకు పనులు ఆపేయాలని సూచిస్తూ జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

ప్రభుత్వం మారాక పోలీసు కేసు

గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో జగదీశ్వరుడుకు కొంత ధైర్యం వచ్చింది. విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు, గద్దె బ్రహ్మాజీపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భార్యను బెదిరించి ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకోవడంతోపాటు తమ సంతకాలను ఫోర్జరీ చేసి తన భూమిని కబ్జా చేశారని 2024 జూన్ 22న ఫిర్యాదుచేశారు. తీవ్రమైన ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలో దిగింది. లోతుగా విచారణ చేసింది. అందులో భాగంగా ఎంవీవీ సత్యనారాయణ ఇళ్లలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకుంది. ఈ భూమిని ఎనిమిది మందికి అమ్మడానికి జగదీశ్వరుడు ప్రయత్నించాడని తేల్చింది. అలాగే ఎంవీవీ బిల్డర్స్, జి.వెంకటేశ్వరరావు, బ్రహ్మాజీలు కలిసి ఈ భూమి ద్వారా రూ.87.64 కోట్లు సంపాదించారని, ఆ మొత్తాన్ని స్వప్రయోజనాలకు వాడుకున్నారని తేల్చింది. అందుబాటులో ఉన్న వారి స్థిరచరాస్తులు రూ.44.75 కోట్ల విలువైనవి స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణం ఆగిపోయింది.

ప్రాక్టికల్ పరీక్షలకు పైసా వసూల్!

... 5వ పేజీ తరువాయి

వసూలు చేసినట్టు తెలిసింది.

అక్రమాలకు పాల్పడితే చర్యలు: ఆర్‌ఐఓ

పరీక్షల నేపథ్యంలో నగదు వసూళ్లపై ఆర్ఐవో మురళీధర్‌ను వివరణ కోరగా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలకు నియమించిన సిబ్బంది ఎలాంటి అక్రమాలకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.40 కోట్లతో పంచాయతీల అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ప్రణాళికలు రూపొందించారు. ప్రణాళికల్లో పేర్కొన్న పనులు చేపడితేనే బిల్లులు మంజూరవుతాయి. వాటిల్లో లేని పనులు చేస్తే బిల్లులు ఇవ్వరాదని కేంద్రం ఆదేశించిందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీలు ప్రతిపాదించిన పనుల వివరాలు పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. సాధారణంగా పారిశుధ్యం, తాగునీరు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, డ్రైన్లు, తదితర పనులకు నిధులు కేటాయిస్తుంటారు.

కోడి వ్యర్థాల సేకరణ టెండర్లలో గోల్‌మాల్

... 5వ పేజీ తరువాయి

సూచన మేరకు ఒక్కో ప్రజాప్రతినిధి సూచించిన వారికి ఒక్కో జోన్ చొప్పున ఎనిమిది జోన్లను సర్దుబాటు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు పిలిచిన అధికారులు అందరి సమక్షంలోనే టెక్నికల్ బిడ్‌ను, తర్వాత ఫైనాన్స్ బిడ్‌ను ఓపెన్ చేసి ఎవరు అర్హత సాధించారు, ఎవరు ఆమోదయోగ్యమైన ధరకు కోట్ చేశారనేది చూసి కాంట్రాక్టర్‌ను ఎంపికచేయాలి. కానీ ప్రజాప్రతినిధుల జోక్యంతో అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్‌ను పక్కనపెట్టేసి ప్రజా ప్రతినిధులు సూచించిన వారికి అనధికారికంగానే ఒక్కో జోన్ చొప్పున వర్క్ ఆర్డర్లు ఇచ్చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యర్థాలు సేకరించే వారంతా కాపులుప్పాడ యార్డుకు కాకుండా చేపల చెరువులకు తరలిస్తున్నాసరే తాము చోద్యం చూడాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు.

రాజమండ్రిలో మాదిరిగా చికెన్ వ్యర్థాలను పర్యావరణ హితంగా ప్రాసెస్ చేసి ఎరువుగా మార్చే యూనిట్‌ను కాపులుప్పాడలో ఏర్పాటు చేయాలని గత కమిషనర్ సంపత్‌కుమార్ భావించారు. అందుకోసం రాజమండ్రిలో యూనిట్‌ను ఏర్పాటుచేసిన సంస్థకు కాపులుప్పాడలోని యార్డులోని ఐదెకరాలు కేటాయించారు. ఆ సంస్థ జీవీఎంసీకి ఏటా రూ.1.5 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. ఆ దిశగా ఒప్పందం చేసుకుంటారనుకుంటున్న సమయంలో సంపత్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. దాంతో ఆ యూనిట్ ఏర్పాటు మరుగునపడినట్టేనని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.



భూలోకమాంబకు క్షీరాభిషేకం

వేపగుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం భూలోకమాంబ ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం చతుర్వేద పారాయణం, సూర్య నమస్కారాలు, మహా లింగార్చన, రుద్రాభిషేకం, ప్రధాన విగ్రహమూర్తికి క్షీరాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన శారదా పీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని శారదా పీఠంలో నిర్వహిస్తున్న పీఠం వార్షికోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆఖరి రోజు రాజశ్యామల యాగం నిర్వహించారు. అనంతరం ఉత్తరాధికారి సాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో పూర్ణాహుతి జరిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రయోగరాజ్ కుంభమేళా త్రివేణి సంగమం నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో ఉత్తరాధికారి రాజశ్యామల అమ్మవారికి అభిషేకం చేశారు. పవిత్ర జలాలను భక్తులపై చల్లి ప్రసాద వితరణ చేపట్టారు.

నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయాలి

గాజువాక, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ పరిధిలో గల 19 ఏళ్లలోపు బాలబాలికలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేయాలని జోన్ ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో వైద్య సిబ్బందికి నులిపురుగుల నివారణ మందులను శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మందులను పిల్లలకు తప్పకుండా ఇవ్వాలన్నారు. వీటిని తీసుకోవడం వల్ల రక్త పుష్టి, ఇమ్యూనిటీ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి

అగనంపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో వివేకానంద జయంత్యుత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్ వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్:** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ:** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 13, వంకాయలు(తెలుపు) 18,వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 42, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 100, అల్లం 42, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోసకాయలు 22, వెల్లులి 170, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 38, కీర దోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 38, కంద 56, దేముడుచిక్కుడు 32, గోరుచిక్కుడు 28, కూరపెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

పరిశ్రమల్లో స్థానికులకు దక్కని ఉపాధి అవకాశాలు

ప్రశ్నిస్తే కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని విమర్శలు

హెచ్‌పీసీఎల్, ఐఓసీలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారికే పనులు



మల్కాపురంలోని ఇండియన్ ఆయిల్ కర్మాగారం

మల్కాపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్, ఐఓసీ పరిశ్రమల నుంచే విడుదలయ్యే కాలుష్యం భరించేది స్థానికులు. వాటిలో ఏదైనా ప్రమాదం జరిగితే నష్టపోయేది కూడా వారే. అయితే ఉపాధి మాత్రం వారికి లభించడం లేదు. దీనిపై పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లను నిలదీస్తే పోలీసులతో కలిసి బెదిరింపులకు దిగుతున్నారని ఇక్కడివారంతా వాపోతున్నారు. హెచ్‌పీసీఎల్, ఐఓసీలో ప్రస్తుతం జోరుగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఇందులో స్థానికులను కాదని ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. దీంతో తమకు కూడా పని ఇవ్వాలని ఆందోళన దిగుతున్న కార్మిక సంఘాల నేతలను సదరు కాంట్రాక్టర్లు పోలీసులతో కలిసి బెదిరిస్తున్నారు. ఇలాగైతే స్థానికులకు ఏ విధంగా ఉపాధి లభిస్తుందని ప్రశ్నిస్తున్నారు. కార్మిక చట్టప్రకారం స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాల్సి ఉంది. కానీ ఈ రెండు పరిశ్రమల్లో పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు ఈ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో పరిశ్రమల యజమాన్యాలు చొరవ తీసుకుని, స్థానికులకు ఉపాధి కల్పించే ప్రయత్నం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

రొట్టెల పండగకు వేళాయె..

రేపటి నుంచి 17వ తేదీ వరకు | శాతవాహననగర్‌లోని షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాలు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ పరిధి వార్డు శాతవాహన నగర్ శ్రీ షిర్డి సాయి ఆలయ 20 వార్షిక ఉత్సవాలను ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దక్షిణ భారత దేశంలో మరెక్కడా లేని విధంగా అప్పటికప్పుడు సుమారు 30 మంది రొట్టెలను తయారుచేసి భక్తులకు అందిస్తుంటారు. నిత్యం ఇక్కడి ఆలయంలో పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తారు.





ఉత్సవాలకు ముస్తాబైన షిర్డీ సాయి ఆలయం.. పక్కన బాబా విగ్రహం

సుమారు 4 వేల రొట్టెలు తయారీ

ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ప్రతి గురువారం సుమారు నాలుగు వేల రొట్టెలు (చపాతీలు) తయారు చేసి కూరతో సహా భక్తులకు అందిస్తుంటారు. ఇక్కడి సాయినాథుని ఆలయంలో 108 సార్లు ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని పారిశ్రామిక ప్రాంత భక్తుల ప్రగాఢ విశ్వాసం. బాబా ఆలయ ప్రాంగణంలో ధ్యాన మందిరం, కపిలగోవు, లెండీవనం, శునకాన్ని భక్తులు దర్శించుకుంటారు.

షిర్డీలో మాదిరిగా చందనోత్సవాలు

షిర్డీలో మాదిరిగానే ఇక్కడి సాయిబాబా ఆలయంలో హిందువులు, ముస్లింలు కలిసి జెండా ఉత్సవం, చందనోత్సవాన్ని ఘనంగా చేస్తారు. ఈ ఆలయంలో నూతనసంవత్సర వేడుకలు, మహా శివరాత్రి, ఉగాది, శ్రీరామ నవమి, వినాయక చవితి నవరాత్రులు, దత్త జయంతి, గురుపౌర్ణమి, దేవీనవరాత్రులు, కార్తీక మాసం, సంక్రాంతి పర్వదినాల్లో ప్రత్యేక పూజలను స్వామివారికి నిర్వహిస్తుంటారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా చంద్రనగర్ చెరువు

» ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చెరువు గట్టు ఆక్రమణలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగర పరిధి 89వ వార్డు కొత్తపాలెం నుంచి చంద్రనగర్ కాలనీ వరకూ గల ఎర్రచెరువు గట్టును కొంతకాలం క్రితం ఆక్రమించారు. అప్పట్లో రాజకీయ నేతల చొరవతో చెరువుగట్టుపై రేకుల షెడ్ల నిర్మాణం చేపట్టారు. అయితే దీనిపై పెద్ద రగడే జరిగింది. చెరువుగట్టుపై ఆక్రమణల కారణంగా చెరువు నిండితే ప్రమాదం పొంచి ఉంటుందని అధికారులు హెచ్చరిండంతో పాటు ఆక్రమిత ప్రాంతంలో ఎటువంటి మౌలిక వసతులు కల్పించక పోవడంతో ఆక్రమణదారులు షెడ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఖాళీగా ఉన్న షెడ్లు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఈ చెరువుగట్టుపై ఉన్న ఖాళీ షెడ్లలో మద్యం, గంజాయి సేవిస్తూ, గంపులుగా సంచరిస్తుంటారు. వీరితో పాటు జూదం, బెట్టింగులు ఆడే వారు చేరుతున్నారు. దీంతో సమీప నివాసితులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వీరి వలన ఏ ఇబ్బంది ఎదురవుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారిన చంద్రనగర్ చెరువు గట్టు

మాజీ సైనికుల భూములకు ఎన్‌వోసీలు ఇవ్వాలి

నావికాదళ మాజీ సెయిలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖ జిల్లా ప్రతినిధులు

మల్కాపురం. ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల కేటాయించిన భూములకు సంబంధించి తక్షణమే ఎన్‌వోసీలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ నావికాదళ మాజీ సెయిలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖ జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. 58వ వార్డు పరిధి శ్రీహరిపురంలో మాజీ సైనికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ఎంతో శ్రమించామని, అయితే పదవీ విరమణ పొందిన తమకు భూములు కేటాయించినప్పటికీ వాటికి సంబంధించి ఎన్‌వోసీలు అడిగితే జిల్లా ఉన్నతాధికారులు ససేమిరా అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తాము భూములు పొంది పదేళ్లు అయిందని, నిబంధనల ప్రకారం పదేళ్లు దాటితే ఎన్‌వోసీ ఇవ్వాలని, కానీ దానిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. కేవలం విశాఖ జిల్లాలోనే ఆర్మీ భూములకు ఎన్‌వోసీలు ఇవ్వడం లేదని పలువురు మాజీ సైనికులు వాపోయారు. అందువల్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల్పించుకుని తమ భూములకు ఎన్‌వోసీలు మంజూరు చేసేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ భూములకు ఎన్‌వోసీలు ఇస్తే తమ జీవితాలు బాగుపడతాయన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సిగులపల్లి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నగిరి ప్రదక్షణ

పలు ఆలయాల వార్షికోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానం వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రసన్నగిరి ప్రదక్షణను వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా కొండపై నుంచి కిందకు తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అధిష్ఠింపజేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యులు, నారాయణాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు గిరిప్రదక్షణ రథానికి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణ, కోలాటాలు, అన్నమయ్య కీర్తనల నడుమ గిరి ప్రదక్షణ సాగింది. 108 కలశాలతో మహిళలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షణలో పాల్గొన్నారు. మింది రహదారి నుంచి అప్పన్న కాలనీ ప్రధాన రహదారి మీదుగా ప్రసన్నగిరి చుట్టూ మూడు సార్లు ప్రదక్షణ చేశారు. అనంతరం శ్రీవారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. కాగా శనివారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని 108 కలశాలతో స్వామివారికి క్షీరాభిషేకం, గరిక పూజలు వంటివి నిర్వహిస్తామని ఆలయ సిబ్బంది తెలిపారు.



ఉత్సవ విగ్రహాలను కొండపై నుంచి దిగువకు తెస్తున్న దృశ్యం



గిరి ప్రదక్షణలో పాల్గొన్న భక్తులు



వెంకన్నపాలెంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

బ్రహ్మంగారి ఆలయ వార్షికోత్సవం


పెందుర్తి: గ్రేటర్ 97వ వార్డు పరిధి చినముషిడివాడ లోని పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం యాగం చేశారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్పొరేటర్ శేనాపతి వసంత శంకరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.పెంటబాబు, అప్పలరాజు, చిన్నారావు, సాధూరావు, వెంకటేశ్వరరావు, సన్నిబాబు, బంగార్రాజు, తదితరులు పూజాది కార్యక్రమాలను చేపట్టారు.

అగనంపూడి సాయిబాబా ఆలయంలో..

అగనంపూడి: ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవాన్ని షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథున్ని ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని తీర్థంలో ఏర్పాటు చేసిన కోలాటాలు, చెక్క భజనలు, సాముగారిడీలు, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యలక్ష్మి పంకజం, సూరీడమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో..

అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్, సేవా సమితి ఆర్గనైజర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



61వ వార్డులో లక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు

మల్కాపురం: గ్రేటర్ 61వ వార్డు పరిధి వెంకన్నపాలెంలో గల శ్రీమురళీకృష్ణ ఆలయం, వాసుదేవ అన్నమయ్య సంకీర్తన సంస్థానం, మురళీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి లక్ష్మీదేవి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు లక్ష్మీదేవిని వేకువజాము నాలుగున్నరకు పురవీధుల్లో ఊరేగించారు. ఐదున్నర నుంచి ఆరు గంటల వరకు విశ్వక్సేనారాధన, అనంతరం లక్ష్మీదేవికి, స్వామివారికి పంచామృతాభిషేకం జరిపారు. ఆ తర్వాత ధ్వజారోహణ, అంకురారోపణ, మండపారాధన, గణపతి హోమం, తీర్థగోష్టి నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సహస్ర కుంకుమార్చన చేశాక నక్షత్ర హారతి, పవళింపు సేవ, తదితర పూజాది కార్యక్రమాలను చేపట్టారు. కాగా శనివారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరపనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కనకదుర్గ ఆలయానికి భూమి పూజ

వేపగుంట: వేపగుంట నుంచి అప్పన్నపాలెం వెళ్లే మార్గంలో నూతనంగా శ్రీకనకదుర్గ ఆయల నిర్మాణా నికి గాను భూమి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఆయిల్ ఫీడ్ ఛైర్మన్ గండి బాబ్జి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావులు విచ్చేసి పూజలు జరిపారు. జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, కార్పొరేటర్లు రాపర్తికన్నా, ముమ్మన దేముడు, సేనాపతి వసంత శంకరరావు, పీవీ నరసింహం, తదితరులు పాల్గొన్నారు. కాగా నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరపనున్నట్టు అర్చకులు శ్రీనివాసస్వామి తెలిపారు.

గరుడాద్రిపై నేడు శ్రీవారికి పూజలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరాలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నట్టు అర్చకులు తెలిపారు. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు వాటిల్లకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.



కార్పొరేటర్ కుటుంబ సభ్యులకు పార్టీ కండువాలు వేస్తున్న గణబాబు

టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ కుటుంబీకులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 89వ వార్డు పరిధి కొత్తపాలెం గ్రామానికి చెందిన మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి సత్యవతి, ఆమె భర్త కొత్తపాలెం పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ అయితంశెట్టి కోటేశ్వరరావు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఆదినుంచి గణబాబుకు ముఖ్య అనుచరుడిగా పేరున్న కోటేశ్వరరావు కుటుంబీకులు మూడేళ్ల క్రితం వైసీపీలో చేరారు. కాగా తన అనుచరులతో పాటు మళ్లీ కోటేశ్వరరావు కుటుంబీకులు గణబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

గంగవరంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న కరణంరెడ్డి

గాజువాక, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, అందరూ క్రీడా స్ఫూర్తితో మెలిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గంగవరం మైదానంలో శుక్రవారం నిర్వహించిన సూపర్ 11 లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వారం రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు, ద్వితీయ స్థానానికి రూ. 20 వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి పది వేల రూపాయలతో పాటు ట్రోఫీలు అందజేస్తామన్నారు. క్రీడాకారులు రాజు, పాత్రాజు, సతీశ్, నాగేంద్ర, కార్తీక్, ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను సందర్శించిన బీసీ సంక్షేమశాఖ పీఎస్



విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

పెందుర్తి, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వ వెనకబడిన తరగతుల సంక్షేమ సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్ విభాగంలో గల ఎస్.ఆర్.శంకరన్ నాలెడ్జి హాస్టల్‌ను సందర్శించారు. వసతిగృహంలో గల వసతులకు పరిశీలించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సంబంధిత శాఖ జిల్లా అధికారి కె.శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

సత్యసాయి సేవా సమితి ఉదారత

దృష్టి లోపం ఉన్న వ్యక్తికి ఇంటిని నిర్మించిన ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): దృష్టి లోపం ఉన్న ఓ వ్యక్తికి స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటిని నిర్మించి ఇచ్చారు. సమితి దత్తత గ్రామమైన నమ్మిదొడ్డిలో వి.అప్పారావు అనే వ్యక్తి పూరింట్లో ఉండేవారు. ఆయనకు అండగా ఉండేందుకు గాను సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా సమితి ఆధ్వర్యంలో ఇంటిని నిర్మించారు. శుక్రవారం ఆ ఇంటి తాళాలను అప్పరావు కుటుంబ సభ్యులకు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, తదితరులు ప్రతినిధులు పాల్గొన్నారు.



అప్పరావు కుటుంబ సభ్యులతో సమితి ప్రతినిధులు

త్రిశక్తి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు



పిల్లలతో కలిసి అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో శుక్రవారం సాముహిక అక్షరాభ్యాసాలను చేపట్టారు. ముందుకు ఆలయంలోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తమ పిల్లలతో విచ్చేసిన తల్లిదండ్రులు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో వందలాది మంది చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్ర మాలను చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

అక్రమంగా నిర్మించిన షెడ్లు కూల్చివేత



ఎక్స్‌కవేటర్‌తో షెడ్లను కూల్చివేస్తున్న దృశ్యం

ఆటోనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గాజువాక మండలం యాదవ జగ్గరాజుపేట సర్వే నంబర్-96/3 ప్రభుత్వ భూమి గయాళ్లు స్థలంలో 350 చదరపు గజాలను ఆక్రమించి కొందరు అక్రమార్కులు ఐదు షెడ్లను నిర్మించారు. ఈ విషయాన్ని కొంతమంది స్థానికులు హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆ షెడ్లను తక్షణమే తొలగించాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు తహసీల్దార్ టి.శ్రీవల్లి ఆదేశాలతో సిబ్బంది శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో సాయంతో షెడ్లను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీవల్లి హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని, అన్ని కార్యకలాపాలు పారదర్శకంగా నిర్వహించాలని నోడల్ అధికారులను కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వసతుల కల్పన, సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలుచేయాలని, అనుమతుల జారీలో చురుగ్గా వ్యవహరించేలా సింగిల్ విండో విధానం పాటించాలని సూచించారు. నోడల్ అధికారులు ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై ఆరా తీసి పలు సూచనలిచ్చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. సాంకేతిక అంశాలపై ఆచితూచి వ్యవహరించాలని, ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది, సామగ్రి తరలింపునకు ముందుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో జేసీ కె. మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డాక్టర్ లూసీ కార్డిలియా



డాక్టర్ లూసీ కార్డిలియా

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ లూసీ కార్డిలియా శుక్రవారం పెదవాల్తేరులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేసి బదిలీపై వచ్చారు. ఇక్కడి డీఐవోగా డాక్టర్ జీవనరాణి పదోన్నతిపై విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణిగా వెళ్లారు.

మెరుగైన ఫలితాలకు సంకల్ప్

» ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి
» జిల్లాలో మొత్తం 5,643 మంది విద్యార్థులు
» మూడు గ్రూపులుగా విభజించిన అధికారులు
» వారికి ప్రత్యేకంగా స్టడీ సమయం
» వెనుకబడిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



కృష్ణ ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీఐఈవో (ఫైల్‌ఫొటో)

మద్దిలపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సంకల్ప్-25 పేరుతో ప్రణాళికను సిద్ధం చేసి అమలుచేస్తున్నారు. జిల్లాలోని పది జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమం పక్కాగా అమలుచేస్తున్నారు. ఈ కళాశాల్లో ప్రథమ సంవత్సరం 2,981 మంది, ద్వితీయ సంవత్సరం 2,662 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిని త్రైమాసిక మార్కుల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించారు. మెరుగైన మార్కులుసాధించిన విద్యా ర్థులు ఏ, అంతంతమాత్రం వచ్చిన వారిని బి, పాస్ మార్కులు దాటని విద్యార్థులను సి కేటగిరీలుగా విభజించారు. వీరికి ప్రతీ కళాశాలలో బోధనతో పాటు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.పది కళాశాలల నుంచి సీ కేటగిరీలో సుమారు 2,500 మంది విద్యార్థులుండడంతో వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఐదుగురు విద్యార్థులకు ఒక కేర్ టేకర్‌ను నియమించారు. అంతేకాకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా వెనుకబడిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తోంది. మార్చి1 నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఫిబ్రవరి 28 వరకు సంకల్ప్-25 నిర్వహించనున్నారు.ఈలోగావెనుకబడిన విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు, కేర్‌టేకర్‌లు శ్రమిస్తున్నారు.

గత ఏడాది దారుణ ఫలితాలు

గత ఏడాది జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉత్తీర్ణత శాతం దారుణంగా పడిపోయింది. ప్రథమ సంవత్సరం పరీక్షలను 1550 రాయగా 32.5 శాతంతో 502 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 1,249 మందికి 48 శాతంతో 566 మంది ఉత్తీర్ణులయ్యారు. నగర పరిధిలోని కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాలు మరింత దారుణంగా వచ్చాయి. ఈ కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం 481 మంది పరీక్షలు రాస్తే 102 మంది పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 406 మందికి 144 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర మంతటా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాలు దారుణంగా ఉండడంతో విద్యా శాఖ మంత్రి సంకల్ప్-25 కార్యక్రమం తలపెట్టారు. వెనుకబడిన విద్యార్థులను సానపెట్టి మెరుగైన ఫలితాలు సాధించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని జిల్లా వృత్తివిద్యాశాకాధికారి బి. రాధ తెలిపారు.

క్రైం... crime news

కుక్కల దాడిలో జింక మృతి



ఎండాడ వద్ద మృతిచెందిన జింక

ఆరిలోవ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కంబాల కొండ అటవీ ప్రాం తం నుంచి జానరణ్యంలోకి వచ్చిన జింకల గుంపుపై కుక్కలు దాడిచేయడంతో ఓ జింక మృతిచెందింది. ఈ సంఘటన శుక్రవారం ఎండాడ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. కంబాల కొండలో ఆహా రం, నీరు లభించకపోవడంతో ఇటీ వల జింకలు జాతీయ రహదారిపైకి చేరుతున్నాయి. జూ పార్కు నుంచి ఎండాడ వరకు విపరీతంగా సంచరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాల కింద పడి కొన్ని, ఇలా కుక్కల దాడిలో మరికొన్ని మృత్యువాత పడుతున్నా యి. గత ఏడాది ఎండాడ సమీపంలో రెండు జింకలు వాహన ప్రమాదంలో మృతిచెందాయి. దీనిపై డీఎఫ్‌వో శ్రీవాణి వద్ద ప్రస్తావించగా, శుక్రవారం పలు జింకలు జాతీయ రహదారిపై చేరడంతో కుక్కలు వెంటబెట్టాయని, ఇందులో ఐదేళ్ల మగ జింక మృతి చెందిందన్నారు. జింకలు జనారణ్యంలోకి రాకుండా కంబాలకొండ ప్రాంతంలో హైవేకు ఆనుకుని కంచె నిర్మించే ఆలోచన ఉందన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశామన్నారు. అయితే నిధుల లేమితో కంచె నిర్మాణానికి అడుగులు పడలేదని వివరించారు. అంతేకాకుండా కంబాలకొండ ప్రాంతంలో జింకలకు విరివిగా ఆహారం, తాగునీరు అందుబాటులో ఉందని, అయితే జాతీయ రహదారి పక్కన రెసిడెన్షియల్ జోన్ పరిధిలో ఆహారానికి కొన్ని జింకలు బాగా అలవాటుపడడంతో తరచూ వచ్చేస్తున్నాయన్నారు. ఆయా ప్రాంతాలను సిబ్బందితో కలిసి సందర్శించామని, నియంత్రించే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా జింక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు తరలించామన్నారు.

చికిత్స పొందుతూ వివరాలు తెలియని వ్యక్తి మృతి



బేత సూర్యనారాయణ (ఫైల్ ఫొటో)

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి: పాత పోస్ట్ జైల్‌రోడ్డులో జనవరి 10న సాయంత్రం రోడ్డు దాటుతున్న బేత సూర్యనారాయణ (80)ను ద్విచక్ర వాహనం ఢీకొట్టిందని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఎస్‌ఐ కె.శ్రీలక్ష్మి తెలిపారు. భీమ్‌నగర్ నుంచి అల్లిపురం వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, తీవ్రంగా గాయపడిన సూర్యనారాయణ చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో జాయిన్ అయ్యారన్నారు. అతడు చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతి చెందినట్లు చెప్పారు. అతని వద్ద ఆధార్‌కార్డు మాత్రమే ఉందన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే టూ టౌన్ ట్రాఫిక్ సీఐ, ఎస్‌ఐకి తెలియజేయాలని ఆమె కోరారు.

11న ఐఐపీఈ, ఐ స్టెమ్ ఆధ్వర్యంలో 'సమావేశ'

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం వర్సిటీ (ఐఐపీఈ), ఐ స్టెమ్ ఆధ్వర్యంలో ఏయూలోని పెట్రో వర్సిటీ ప్రాంగణంలో ఈనెల 11న సమావేశ పేరుతో పరిశోధకులు, పరిశ్రమలు, స్టార్టప్ నిర్వాహకులను అనుసంధానించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇండియన్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఫెసిలిటీస్ మ్యాప్ (ఐస్టెమ్) కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజరీ కార్యాలయం రూపొందించిన ఇంటరాక్టివ్ వెబ్‌పోర్టల్ సమావేశ. దీని ఆధ్వర్యంలో పరిశోధన, శాస్త్రీయ సౌకర్యాలను గుర్తించేందుకు, భాగస్వామ్యం కల్పించేందుకు పరిశోధకులకు సమావేశ ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. విభిన్న అంశాలపై పరిశోధనలు చేసేవారికి, స్టార్టప్ నిర్వాహకులకు మెరుగైన అవకాశాలను కల్పించే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని తెలిపారు. కీలక పరిశోధనలు చేసి, తగిన పరికరాలు, అందుకు తగ్గ ల్యాబ్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఇది మేలు చేకూరుస్తుందన్నారు. సమావేశలో ఐ స్టెమ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, నేషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హరిలాల్ భాస్కర్, బృందం హాజరవుతారని తెలిపారు.

అత్యాచార నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి



ధర్నాలో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

సిరిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్‌బీ కాలనీ పరిధిలో ఇటీవల పదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ ప్లకార్డులు చేతపట్టుకుని మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి అత్యాచారానికి పాల్పడిన కామాంధుడిని శిక్షించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేయాలన్నారు. జనావాసాల మధ్య, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న మద్యం షాపులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి యు. రాజు మాట్లాడుతూ బాధితకుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు అధ్యక్షత వహించగా, జె.నాయుడు, అనిల్, ఇ.ఆదినారాయణ, శ్రావణ్, సురేష్, కె.కుమారి, హేమ, కొండమ్మ, నిత, నయేమి, కార్మికులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐవో మురళీధర్

» ఆర్‌ఐవో మురళీధర్

మద్దిలపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బి.మురళీధర్ ఆదేశించారు. ఈనెల పదో తేదీ నుంచి జరగనున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలపై శుక్రవారం బీవీకే కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు(సీఎస్), డెక్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకే సీఎస్‌లు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలస్యమైన విద్యార్థులకు సరైన కారణముంటే పరీక్షకు అనుమతించాలన్నారు. ఇన్విజిలేటర్ల ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిని పరీక్ష గదుల్లోకి పంపించాలన్నారు. కచ్చితంగా సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే విద్యార్థులంతా పరీక్షలు రాసే విధంగా చూడాలన్నారు. పరీక్ష అనంతరం జవాబు పత్రాలను సీసీ కెమెరాల వద్దే మూల్యాంకనం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కోరుకున్న లక్ష్యం చేరుకునే వరకు విశ్రమించొద్దు

» యువతకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపు
» ఘనంగా వివేకానందుని శోభాయాత్ర

మహారాణిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యువత కోరుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించవద్దని స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా శుక్రవారం రామకృష్ణ మిషన్ విశాఖ ఆశ్రమం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. సుమారు 30 పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు సహా ఐదు వేలమంది పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి బీచ్‌రోడ్డులోని స్వామి వివేకానంద ఆశ్రమం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. యువతే దేశాభివృద్ధికి వెన్నెముక అని, స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. శోభాయాత్రలో పెద్దసంఖ్యలో యువత పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పాత జైల్‌రోడ్డు, నౌరోజీ రోడ్డు, బీచ్ రోడ్డు మీదుగా వివేకానంద ఆశ్రమానికి ర్యాలీ చేరుకుంది. స్వామి వివేకానంద విగ్రహం ర్యాలీలో పలువురిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో రియర్ అడ్మిరల్ కె శ్రీనివాస్, డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు, డి.సూర్యప్రకాశరావు, కస్టమ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, రామకృష్ణ ఆశ్రమ వాసులు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియా వ్యాప్తిని నియంత్రించండి

» అధికారులకు కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా, డెంగ్యూ జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వ్యాధుల నియంత్రణ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదైన జ్వర పీడితుల వివరాలను వైద్యఆరోగ్యశాఖ అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పోర్టు అథారిటీ, స్టీల్‌ప్లాంట్, నేవీ, రైల్వే తదితర ప్రాంతాల్లో ఫాగింగ్, ఐయాంటీ లార్వా స్ప్రే చేయాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, విద్యా సంస్థలు, వసతిగృహాల్లో దోమలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యా ర్థులకు జ్వరం సోకిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకు వెళ్లాలని సూచించారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా జిల్లాకు కేటా యించిన ఎనిమిది ఫాగింగ్ మిషన్లను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, డీఆర్‌డీఏ, సోషల్ వెల్ఫేర్, నేవీ, పోర్టు, స్టీల్ ప్లాంట్, కేజీహెచ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్జీ కూలర్లు ప్రయోగాత్మకమే: జేడీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో సబ్జీ కూలర్లను ప్రయోగాత్మకంగా పెట్టామని, వాటిని కొనుగోలు చేయమని ఎవరిపైనా ఒత్తిడి చేయడం లేదని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఎంవీపీ కాలనీ, గోపాలపట్నం రైతుబజార్లలో రెండేసి చొప్పున ప్రయోగాత్మకంగా పెట్టామన్నారు. ఆకుకూరలు, పండ్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఎవరైనా ఆసక్తి చూపితే 50 శాతం రాయితీపై సమకూరుస్తామని, తప్పనిసరిగా తీసుకోవాలనే నిబంధన లేదన్నారు.